




ESTD: 1999

25-10-2026 ఆదివారం

www.voodayam.com

# వుదయం








వరంగల్ | 27-10-2026 మంగళవారం సంపుటి : 11 | సంచిక : 312 SINCE 27 YEARS CIRCULATED TELUGU DAILY రూ. 3.00 | పేజీలు : 12 VOODAYAM Telugu DAily

Simultaneously Published from Warangal , Hyderabad, Adilabad, Karimnagar, Khammam & Guntur Follow us on


## ఆదిలాబాద్ ఆదివాసీల

### ప్రాణహిత బ్యారేజీకి మార్గం సుగమం

# దశాబ్దాల కల నెరవేరే దిశగా...



### తుమ్మిడిహెట్టి బ్యారేజీకి 'మహా' సానుకూలం

### దేవేంద్ర ఫడ్నవీస్‌తో రేవంత్ రెడ్డి బృందం భేటీ

### 152 మీటర్ల ఎత్తుపై అధ్యయనానికి అధికారుల కమిటీ

**ముంబై , అక్టోబర్ 26 (ఎఎంఎస్) :** తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై ప్రతిపాదించిన తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై సానుకూల వాతావరణంలో కీలక చర్చలు జరిగాయి. ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని ఉన్నత స్థాయి బృందం సమావేశమైంది. ఈ భేటీకి రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, నీటిపారుదల శాఖల ముఖ్య అధికారులు హాజరయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజల దశాబ్దాల తాగు, సాగునీటి కల నెరవేర్చేందుకు బ్యారేజీ ఎత్తును 152 మీటర్లుగా నిర్ణయించాలన్న తెలంగాణ ప్రతిపాదనకు మహారాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

సమావేశ ప్రారంభంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రాజెక్టు ప్రాధాన్యాన్ని వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్థిక వెనుకబాటుతనం, గిరిజనుల జీవన ప్రమాణాలు, 1975 జలగం వెంగళరావు ఎస్బీ చవాన్ ఒప్పందం నాటి నుంచి నేటి వరకు జరిగిన చర్చలను వివరించారు. 2016 నాటి 148 మీటర్ల ఒప్పందం వల్ల తెలంగాణ తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని స్పష్టం చేశారు. విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం తగ్గించుకుంటూ పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా గ్రావిటీ ద్వారా నీటిని తరలించాలంటే 152 మీటర్ల ఎత్తు అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. ఈ ఎత్తు పెంపు వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు ఆ రాష్ట్ర భూసేకరణ చట్టం, పరిహార నిబంధనల ప్రకారమే పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు.

అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణమహారాష్ట్రల నడుమ ఉన్న చారిత్రక, సాంస్కృతిక అనుబంధాన్ని గుర్తుచేశారు. కొమురం భీమ్ చేపట్టిన 'జల్, జంగిల్, జమీన్' పోరాట సమయం నుంచి ఆదిలాబాద్ గిరిజనులు సాగు, తాగునీటి కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రాణహితపై నిర్మించే ఈ బ్యారేజీ రెండు రాష్ట్రాల అభివృద్ధిని కలిపే వారధిగా నిలుస్తుందన్నారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదించిన రక్షణ, పౌర విమానాశ్రయం సరిహద్దు ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలను పుంజుకునేలా చేస్తుందని, ఇది ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు మహారాష్ట్ర సరిహద్దు జిల్లాలకు ఎంతో ప్రయోజనకరమని వివరించారు. తెలంగాణ ప్రతిపాదనలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎంతో సానుకూలత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ ప్రాంతంతో ఉన్న అనుబంధాన్ని, తమ అమ్మమ్మ తెలుగు మాట్లాడే విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. మహారాష్ట్ర ప్రజలకు, తమ భూములకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల పరిమితిని పునఃపరిశీలించేందుకు తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. నీటి లభ్యత, ముంపు ప్రభావం, బ్యారేజీ ఎత్తు, ఇతర సాంకేతిక అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా అధ్యయనం చేసేందుకు ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో సంయుక్త అధికారుల కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూసి) సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందని, ఈలోగా కమిటీ అధ్యయనం చేసి తదుపరి కార్యాచరణకు రోడ్ మ్యాప్ తయారు చేస్తుందని తెలిపారు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు రావాల్సిందిగా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. ఈ ఆహ్వానానికి ఫడ్నవీస్ సానుకూలంగా స్పందిస్తూ, సదస్సుకు హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

## కమిషనర్‌ను తొలగిస్తే

# నిరసనలు ఆగుతాయి



**న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (ఎఎంఎస్) :** 'ఓటు చోరీ'కి వ్యతిరేకంగా దేశ రాజధానిలోని రామ్‌లీలా మైదానంలో నవంబరు 1న 'ఇండియా' కూటమి నిర్వహించ తలపెట్టిన బారీ నిరసన కార్యక్రమాన్ని వాయిదా వేయాలని దిల్లీ వ్యాపార వర్గాలు కోరుతున్నాయి. దీపావళి పండగ సమయం కావడంతో ఈ నిరసన వల్ల తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఇటీవల లేఖ రాశాయి. ఈ లేఖపై రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా స్పందించారు.

రాజధానిలోని ప్రతి వ్యాపారి అభిప్రాయాన్ని తాము వింటున్నామని, వారి ఇబ్బందులను అర్థం చేసుకుంటున్నామని రాహుల్ తెలిపారు. అయితే, మెట్రో సేవలను ప్రభుత్వమే నిలిపివేసిందని, దారులను మూసివేసి దిల్లీ నగరాన్ని పూర్తి దిగ్బంధంలో ఉంచిందని ఆయన విమర్శించారు. ప్రజల ఓట్లనే చోరీ చేస్తే ఇక దుకాణాలు, పొదుపు మొత్తం, పిల్లల భవిష్యత్తు ఏదీ సురక్షితంగా ఉండదని వ్యాపారులకు సూచించారు. దేశ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను బాధ్యతల నుంచి తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీని కోరాలని, అలా జరిగితే కేవలం 30 సెకన్లలోనే ఈ నిరసనలన్నీ ముగిసిపోతాయని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. కాగా, దీపావళి పండగ సీజన్‌లో దిల్లీలో శతకోట్ల మేర వ్యాపార కార్యకలాపాలు సాగుతాయని 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ' (సిటిఐ) వెల్లడించింది. నవంబరు 1న చేపట్టే ఈ భారీ ఆందోళన వల్ల రామ్‌లీలా మైదాన పరిసర ప్రాంతాల్లో దాదాపు రూ.10 వేల కోట్ల మేర వ్యాపార లావాదేవీలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని అంచనా వేసింది. ఈ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, నిరసన కార్యక్రమాన్ని నవంబరు 10 తర్వాత నిర్వహించాలని కోరుతూ రాహుల్ గాంధీకి విజ్ఞప్తి లేఖ పంపింది.

# పార్లమెంట్ ఆవరణలో అగ్నిప్రమాదం



### నార్త్ బ్లాక్‌లో చెలరేగిన మంటలు

### ఘటన దృశ్యాలను పంచుకున్న ఎంపీ మిలింద్ దేవ్ రా

**న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (ఎఎంఎస్) :** దేశ రాజధానిలోని పార్లమెంట్ ఆవరణలో ఉన్న నార్త్ బ్లాక్ ప్రాంతంలో ఆకస్మిక అగ్నిప్రమాదం సంభవించింది. భవనంలో మరమ్మతు పనులు జరుగుతున్నసమయంలోఒక్కసారిగా మంటలు చెలరేగి, పరిసర ప్రాంతాల్లో నల్లటి దట్టమైన పొగ వ్యాపించింది. సమాచారం అందుకున్న వెంటనే ఆరు అగ్నిమాపక శకటాలు ఘటనా స్థలానికి చేరుకుని శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. ఈ ప్రమాదం ఎలా జరిగిందనే అంశంపై సంబంధిత అధికారులు సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను రాజ్యసభ సభ్యుడు మిలింద్ దేవ్ రా సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు.

### ఆంధ్రప్రదేశ్‌లో లేని పంటల విరామం

# తెలంగాణలోనే ఎందుకు ?



**హైదరాబాద్, అక్టోబర్ 26 (వుదయం)** తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు హరీశ్‌రావు బహిరంగ సవాల్ విసిరారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు గ్రావిటీ (గురుత్వాకర్షణ) ద్వారా నీటిని తరలించడం సాధ్యమని నిరూపిస్తే తాను వెంటనే శాసనసభ్యత్వానికి రాజీనామా చేయడానికి సిద్ధమని స్పష్టం చేశారు. ఒకవేళ అది అసాధ్యమని తేలితే మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తారా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం ముంబైలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో భేటీ అయిన నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ముందుగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు సమగ్ర స్వరూప నివేదికను (డీపీఆర్) బహిరంగపర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని నీటిపారుదల నిర్వహణపై కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పొరుగునున్న ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణలోనే వర్షపాత లోటు తక్కువగా ఉన్నప్పటికీ, ఇక్కడ పంటల విరామం (క్రాప్ హాలిడే) ప్రకటించాల్సిన పరిస్థితులు ఎందుకు వచ్చాయని నిలదీశారు. దేవాదుల వద్ద పంపులను సక్రమంగా నడిపి ఉంటే ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఈ కరవు పరిస్థితి వచ్చేది కాదన్నారు. శ్రీశైలంలో సరిపడా జలాలు ఉన్నప్పటికీ నీటిని ఎందుకు ఎత్తిపోయలేదని, కల్వకుర్తి వద్ద ఐదు మోటార్లు అందుబాటులో ఉన్నా కేవలం రెండింటినే అది కూడా రోజుకు రెండు గంటలు మాత్రమే ఎందుకు నడుపుతున్నారని ప్రశ్నించారు. శ్రీశైలం నుంచి ఆంధ్రప్రదేశ్ తరలిస్తున్న నీళ్లెంత, తెలంగాణ వాడుకుంటున్న నీళ్లెంతో స్పష్టం చేయాలని, దేవాదుల, కల్వకుర్తి పంపుల వినియోగంపై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కన్నెపల్లి వద్ద అవకాశం ఉన్నప్పటికీ నీటిని ఎత్తిపోయడంలో ప్రభుత్వం విఫలమైందని, ప్రస్తుత పరిస్థితి ప్రకృతి తెచ్చిన కరవు కాదని, ముమ్మాటికీ కాంగ్రెస్ పాలనా విఫలత వల్ల వచ్చిన కరవేనని ఆరోపించారు. మహారాష్ట్ర పర్యటనపై స్పందిస్తూ.. 2014లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 42 రోజుల్లోనే సరిహద్దు జల వివాదాలపై మహారాష్ట్రతో చర్చలు ప్రారంభించిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల తర్వాత, మూడేళ్ల సుదీర్ఘ కాలయాపన చేసి ఇప్పుడు చర్చలంటూ మహారాష్ట్రకు వెళ్లారని విమర్శించారు.

## ఇరాన్ ముప్పు..

### ఇజ్రాయెల్ పోలింగ్ కలకలం



**జెరూసలేం:** సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమవుతున్న ఇజ్రాయెల్‌లో ఇరాన్‌పై మరోసారి దాడి చేసే అంశం తీవ్ర రాజకీయ కలకలానికి దారితీసింది. ఇరాన్‌పై దాడి విషయంలో ప్రధానమంత్రి బెన్యామిన్ నెతన్యాహు, సైనిక నాయకత్వం మధ్య తీవ్ర అభిప్రాయ భేదాలు తలెత్తాయని, ఒకవేళ ఇరాన్‌పై దాడికి దిగితే ఆ దేశంతో మళ్లీ పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభమవుతుందని ఇజ్రాయెల్ మిలిటరీ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారని స్థానిక వార్తా సంస్థల్లో కథనాలు వెలువడ్డాయి. అయితే, ఈ వార్తలను నెతన్యాహు కార్యాలయం పూర్తిగా కల్పితాలని స్పష్టం చేస్తూ త్రోసిపుచ్చింది. రక్షణశాఖ మంత్రి కాట్జ్ సైతం ఈ కథనాలను ఖండిస్తూ.. ఎన్నికలకు ముందు ఇరాన్‌పై దాడి చేసే ఆలోచన తమకు లేదని, కానీ ఒకవేళ ఇరాన్ ముందుగా దాడికి తెగబడితే మాత్రం తీవ్ర స్థాయిలో తిప్పికొడతామని హెచ్చరించారు. మరోవైపు, ఈ కథనాల ఆధారంగా ప్రతిపక్ష నేతలు ప్రధాని నెతన్యాహుపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు.

## సైనిక దళాల ఆధునికీకరణకు

# రూ.2.12 లక్షల కోట్లు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 26 (ఎఎంఎస్) :** భారత త్రివిధ దళాల పోరాట సామర్థ్యాలను, రక్షణ వ్యవస్థను సరికొత్త ఎత్తుకు తీసుకువెళ్లే దిశగా కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఏకంగా రూ.2.12 లక్షల కోట్ల భారీ వ్యయంతో వివిధ రకాల ఆధునిక ఆయుధాలు, సైనిక సామగ్రి కొనుగోలు ప్రతిపాదనలకు పచ్చజెండా ఊపింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన 'రక్షణ కొనుగోళ్ల మండలి' ఈ కొనుగోలు ప్రతిపాదనలకు తుది ఆమోదం తెలిపింది. ఈ భారీ కేటాయింపుల్లో ప్రాధాన్యంగా 82 శాతం కొనుగోళ్లను స్వదేశీ ఉత్పత్తులు, సాంకేతికతల నుంచే చేపట్టడం విశేషం. ఈ నిర్ణయం ద్వారా భారత సైన్యానికి అత్యంత ఆధునిక తేలికపాటి మల్టీరోల్ హెలికాప్టర్లు, శత్రు లక్ష్యాలను ఖచ్చితత్వంతో ఛేదించే దీర్ఘశ్రేణి ఆత్మాహుతి డ్రోన్లు, అతి స్వల్పశ్రేణి గగనతల రక్షణ వ్యవస్థలు అందుబాటులోకి రానున్నాయి. వీటితో పాటు శత్రువుల కదలికలను ముందే గుర్తించే అత్యాధునిక రాడార్లను దళాలకు అందించనున్నారు. మరోవైపు భారత నౌకాదళ బలోపేతానికి సైతం రక్షణ కొనుగోళ్ల మండలి ప్రాధాన్యమిచ్చింది. శత్రువుల నౌకా విధ్వంసక క్షిపణుల దాడి నుంచి సొంత యుద్ధనౌకలకు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించే 'యాక్టివ్ ఆఫ్ బోర్డ్ డెకాయ్ సిస్టమ్'తో పాటు మరికొన్ని అత్యాధునిక రక్షణ వ్యవస్థల కొనుగోలుకు ఆమోదముద్ర వేసింది. ఈ నూతన సాంకేతికతలు సముద్ర సరిహద్దుల్లో మన నావికాదళ సురక్షితత్వాన్ని, ప్రతిదాడి సామర్థ్యాన్ని మరింత పెంచుతాయని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## ఇంతే కదా...!




# రూ.100 కోట్ల పాఠశాలల అనుమతుల కుంభకోణం



**చెన్నై:** ద్రావిడ మున్నేట్ర కజగం (డీఎంకే) ముఖ్య నాయకుడు, తమిళనాడు మాజీ మంత్రి అన్బిల్ మహేశ్ పొయ్యామొళిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రైవేటు పాఠశాలల అనుమతుల జారీలో దాదాపు రూ.100 కోట్ల మేర అవినీతికి పాల్పడినట్లు నమోదైన కేసులో ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రైవేటు విద్యా సంస్థలకు శాశ్వత గుర్తింపు, ఇతర చట్టబద్ధమైన అనుమతులు ఇవ్వడంలో జరిగిన అక్రమాలపై అన్బిల్ మహేశ్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు సోమవారం త్రోసిపుచ్చింది. న్యాయస్థానం బెయిల్ నిరాకరించిన కొద్దిసేపటికే పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. తిరువెంబూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2016, 2021 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు శాసనసభ్యుడిగా గెలిచిన మహేశ్, 202126 కాలంలో తమిళనాడు పాఠశాల విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా దాదాపు 1,000 ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల నుంచి 'పార్టీ నిధి' పేరిట భారీగా నగదు వసూలు చేశారనే తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. ఈ భారీ ఆర్థిక అక్రమాల వ్యవహారంలో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సైతం ప్రత్యేక కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేసింది.




# మార్వాడీ సిర్వి సమాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధుల వినతి



## మంగాపురం కాలనీలో ఘనంగా అన్నప్రసాద వితరణ

- **ప్రతి మాసము పౌర్ణమి రోజున శ్రీ వెంకటేశ్వర స్వచ్ఛంద అన్న ప్రసాద వితరణ సేవ కమిటి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కాప్రా (వుదయం ప్రతినిధి)**

అక్టోబర్ 26,మేడ్చల్ జిల్లా నాచారం సర్కిల్ మీర్పేట్ హెచ్.బి . కాలనీ 19 డివిజన్ మంగాపురం కాలనీ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆర్చ్ వద్ద పౌర్ణమి మరియు వాల్మీకి జయంతి సందర్భంగా ఈ రోజున శ్రీ వెంకటేశ్వర స్వచ్ఛంద అన్న ప్రసాద వితరణ సేవ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర స్వచ్ఛంద అన్న ప్రసాద వితరణ సేవా కమిటి సభ్యులు సమ్మని మురళీ చారి మాట్లాడుతూ ఈరోజు పౌర్ణమి సందర్భంగా వెంకటేశ్వర స్వామి వారికి ఎంతో ప్రీతికరమైన తిధి అని తిరుమలలో కూడా పౌర్ణమి రోజున స్వామివారిని గరుడ వాహనం



పైన ఊరేగింపు చేస్తారని తెలియజేశారు. ప్రతి నెల పౌర్ణమి రోజున శ్రీ వెంకటేశ్వర స్వచ్ఛంద అన్న ప్రసాద వితరణ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సహాయ సహకారాలతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈరోజు పౌర్ణమి సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తన్నీరు బ్రహ్మయ్య, సమ్మని మురళీ చారి, విక్రమ్ ఠాగూర్, సాయినాథ్,S. సత్యనారాయణ చారి, రామకృష్ణ, P.మల్లేష్ గౌడ్, పవన్ కుమార్, సురేష్, శివ కుమార్ వర్మ, ప్రభాకర్ చారి, వరదరాజు,మణికంఠ వాలంటరీగా ముందుకు వచ్చి పనిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసారు.

## ఎమ్మెల్సీ నూతన ఓటర్ల ఆన్‌లైన్ నమోదు కార్యాలయం ప్రారంభం



- **సైనిక్‌పురిలోని ఎమ్మెల్యే నివాసంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసిన మార్వాడీ సిర్వి సమాజ్ ప్రతినిధులు**

**కాప్రా (వుదయం ప్రతినిధి) అక్టోబర్ 26,**

హైదరాబాద్‌లోని చెర్లపల్లి, ఈసీ నగర్‌కు చెందిన మార్వాడీ సిర్వి సమాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సైనిక్‌పురిలోని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా చెర్లపల్లి ప్రాంతంలో తమ సమాజానికి ప్రత్యేక శ్మశానవాటిక ఏర్పాటు చేసుకునేందుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే గారికి వినతిపత్రం అందజేశారు.

### అల్వాల్ ఐ.జి. జంక్షన్ అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి



**అల్వాల్, అక్టోబర్ 26:**

మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని అల్వాల్ ఐ.జి. సర్కిల్ (I.G. Junction) వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను అల్వాల్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి గారు ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, జంక్షన్ అభివృద్ధి ద్వారా స్థానిక ప్రజలకు, వాహనదారులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

గతంలో 2024 జూన్ 28న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారు అల్వాల్ ఐ.జి. సర్కిల్‌ను విస్తరించి అభివృద్ధి చేయాలని ధర్నా నిర్వహించి, ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జంక్షన్ వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించి, వాహనదారులు, స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే గారు గతంలో కృషి చేశారు. అనంతరం సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ జంక్షన్ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం అభివృద్ధి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి గారు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పురోగతిని సమీక్షించారు.

అల్వాల్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, ఐ.జి. జంక్షన్ అభివృద్ధికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి గారు గతంలో చేసిన కృషి ఫలితంగా అభివృద్ధి పనులు ముందుకు సాగుతుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ నూతన ఓటర్ల ఆన్‌లైన్ నమోదు కార్యాలయం ప్రారంభం

**కాప్రా ( వుదయం ప్రతినిధి అక్టోబర్ 26, మేడ్చల్ జిల్లా**

ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం, హెచ్‌బీ కాలనీ డివిజన్‌లో బీజేపీ హెచ్‌బీ కాలనీ డివిజన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ నూతన ఓటర్ల ఆన్‌లైన్ నమోదు కార్యాలయాన్ని ఎల్ఐజీ75లో ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు రామ్ ప్రదీప్ మునుగంటి మాట్లాడుతూ, అర్హత కలిగిన గ్రాడ్యుయేట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఎమ్మెల్సీ ఓటును ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

---

- **సైనిక్‌పురిలోని ఎమ్మెల్యే నివాసంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసిన మార్వాడీ సిర్వి సమాజ్ ప్రతినిధులు**

**కాప్రా (వుదయం ప్రతినిధి) అక్టోబర్ 26,**

హైదరాబాద్‌లోని చెర్లపల్లి, ఈసీ నగర్‌కు చెందిన మార్వాడీ సిర్వి సమాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సైనిక్‌పురిలోని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారి నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా చెర్లపల్లి ప్రాంతంలో తమ సమాజానికి ప్రత్యేక శ్మశానవాటిక ఏర్పాటు చేసుకునేందుకు అనువైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే గారికి వినతిపత్రం అందజేశారు.తమ సమా



జానికి ప్రత్యేక శ్మశానవాటిక లేకపోవడంతో మృతుల అంత్యక్రియల సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులను ప్రతినిధులు ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లారు. సమాజ సభ్యుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చెర్లపల్లి పరిధిలో అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కేటాయించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.శ్మశానవాటిక ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ నిబంధనలు, పర్యావరణ మార్గదర్శకాలు, ఇతర చట్టపరమైన విధివిధానాలకు అనుగుణంగా వ్యవహరిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. శ్మశానవాటిక ఏర్పాటైన అనంతరం దాని నిర్వహణ, పరిశుభ్రత, పరిరక్షణ బాధ్యతలను కూడా సమాజం తరపున చూసుకుంటామని పేర్కొన్నారు.ఈ అంశంపై ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారుల ద్వారా తగిన చర్యలు తీసుకునేలా సహకరించాలని మార్వాడీ సిర్వి సమాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

ఈ కార్యక్రమంలో మార్వాడీ సిర్వి సమాజ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు BRS పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ స్టేట్ గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా టీ. కరుణాకర్

- **గ్రాడ్యుయేట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా**
- **నూతన అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కరుణాకర్**

తెలంగాణ లెక్చరర్ల ఫోరం అనుబంధ సంఘమైన తెలంగాణ స్టేట్ గ్రాడ్యుయేషన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా షాద్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ టీ. కరుణాకర్ నియమితులయ్యారు. తెలంగాణ లెక్చరర్ల ఫోరం చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ కత్తి వెంకటస్వామి, ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ నియామకం జరిగినట్లు తెలిపారు. షాద్‌నగర్ ప్రాంతానికి చెందిన టీ. కరుణాకర్‌కు తెలంగాణ స్టేట్ గ్రాడ్యుయేషన్ అసోసియేషన్‌లో కీలక బాధ్యతలు అప్పగించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆయన తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ రాష్ట్రంలోని గ్రాడ్యుయేట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టీ. కరుణాకర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించిన తెలంగాణ లెక్చరర్ల ఫోరం చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ కత్తి వెంకటస్వామి, అధ్యక్షుడు రామకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తూ గ్రాడ్యుయేట్ల అభ్యున్నతికి శక్తి



వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. తెలంగాణ

## మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా ఖర్గే దిష్టిబొమ్మ దహనం

**ప్రధాని మోదీ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం: బీజేపీ నాయకులు**

**రాజ్ భూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో నిరసన.. పాల్గొన్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, కక్కునూరు వెంకటేష్ గుప్తా**

**రంగారెడ్డి జిల్లా:**

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, ఆయన కుటుంబ సభ్యులపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా రంగారెడ్డి జిల్లా



భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి, పాపయ్య గౌడ్, తోకల శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, వై. శ్రీధర్, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ప్రధాని నరేంద్ర మోదీని, ఆయన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని పదేపదే అవమానకర వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని బీజేపీ నాయకులు విమర్శించారు. రాజకీయాల్లో విమర్శలకు హద్దులు ఉండాలని, వ్యక్తిగత దూషణలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ నాయకులు వెంకటేశ్ గుప్తా, వంశీకృష్ణ, విఠల నరసింహ, మోహన్ సింగ్, మోటే శ్రీను, నరసింహ యాదవ్, శ్రీనివాస్ చారి, హరీష్ ముదిరాజ్, శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్, నరసింహ, నవీన్‌తో పాటు పలువురు జిల్లా, రాష్ట్ర నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం!

- **విద్యార్థులకు పోలీసుల విధులు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన..**

**ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు**

**ఆమనగల్లు, అక్టోబర్ 26**

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆమనగల్లు ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ, పోలీస్ ఫ్లాగ్ డే వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆమ



నగల్లు జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా పోలీసుల విధులు, బాధ్యతలు, ప్రజలకు అందించే సేవలను వివరించారు. పోలీసు వ్యవస్థ పనితీరును ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, సామాజిక మాధ్యమాల సద్వినియోగంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసు సిబ్బందికి కూడా వ్యాసరచన పోటీ నిర్వహించి ప్రజలకు, పోలీసులకు మధ్య సంబంధాలు, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతో నేరాల నివారణకు, సురక్షిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు.

## ఓట్ బచావో – దేశ్ బచావో నినాదంతో కాంగ్రెస్ ప్రజా చైతన్య కార్యక్రమం

- **నవంబర్ 1న రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ.. విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకుల పిలుపు**
- **AICC పరిశీలకులు మోహన్ కుమారన్ మంగళం**

**చేవెళ్ల, అక్టోబర్ 26 (వుదయం)**

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఏఐసీసీ పరిశీలకులు మోహన్ కుమారన్ మంగళం స్పష్టం చేశారు.ఓటు హక్కు పరిరక్షణే దేశ ప్రజాస్వామ్య పరిరక్షణకు పునాది అని పేర్కొంటూ, ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓట్ బచావో - దేశ్ బచావో' కార్యక్రమాన్ని విస్తృతంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.మొయినాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అధ్యక్షతన, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామేన భీమ్ భరత్ ఆధ్వర్యంలో 'ఓట్ బచావో - దేశ్ బచావో' అంశంపై ముఖ్య విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఏఐసీసీ పరిశీలకులు మోహన్ కుమారన్ మంగళంతో పాటు అబ్జర్వర్ అఫ్సర్ జేసోఫీ హాజరయ్యారు.ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

ఈ సందర్భంగా మోహన్ కుమారన్ మంగళం, అఫ్సర్ జేసోఫీ మాట్లాడుతూ..ప్రజాస్వామ్య వ్యవస్థను



బలోపేతం చేయాలంటే ఓటు హక్కును పరిరక్షించడం అత్యంత కీలకమని పేర్కొన్నారు.దేశంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రజలను చైతన్యవంతం చేయడానికి 'ఓట్ బచావో - దేశ్ బచావో' కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.నవంబర్ 1న భారీ బహిరంగ సభ.. కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలి రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామేన భీమ్ భరత్ మాట్లాడుతూ.. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. చేవెళ్ల నియోజకవర్గంతో పాటు రంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని



కోరారు.ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన పెంపొందించే దిశగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు చల్లా నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రఘునాథ్ యాదవ్, జగదీశ్వర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ తీగల అనిత హరినాథ్ రెడ్డి, నాయకులు గౌరీ సతీష్, ఏనుగు జంగారెడ్డి, షాబాద్ దర్శన్, రాంరెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ ఖాజా సలావుద్దీన్ అమీర్, చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ సమత వెంకట్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు మానయ్య, షాబాద్ మండల అధ్యక్షుడు పెంట రెడ్డి, విక్రమ్ రెడ్డి, చెన్నయ్య, శ్రీకాంత్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, వివిధ అనుబంధ సంఘాల నాయకులు హాజరయ్యారు.

## జిన్నారంలోనే డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేయాలి

**- బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.. నిరసన**

**జిన్నారం అక్టోబర్26(వుదయం ప్రతినిధి)**

జిన్నారం మున్సిపల్ కేంద్రంలో డీఎస్పీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, అక్కడి నుంచే పరిపాలన సాగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, కార్యాలయాన్ని ఇతర ప్రాంతానికి తరలించే ప్రయత్నాలను నిరసిస్తూ బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం మున్సిపల్ బిజెపి శాఖ అధ్యక్షుడు జగన్ రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ ప్రధాన చౌరస్తా లో భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కేంద్రంలోనే డీఎస్పీ కార్యాలయాన్ని నిర్మించి, ఇక్కడి నుంచే పోలీసు పరిపాలన కొనసాగించాలని వారు పెద్ద ఎత్తున నినాదాలు



చేస్తూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జగన్ రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వం జిన్నారం కేంద్రంగా డీఎస్పీ కార్యాలయం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నప్పటికీ, కొందరు నాయకులు, అధికారులు కార్యాలయాన్ని మరో ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. జిన్నారం పేరుతో ఇతర ప్రాంతంలో కార్యాలయం ఏర్పాటు చేయడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిన్నారంలోనే డీఎస్పీ కార్యాలయాన్ని నిర్మించి, స్థానిక ప్రజలకు పోలీసు సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బిజెపి నాయకులు కార్యకర్తలు తాసిల్దార్ ఆంటోనీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నిరసన ర్యాలీలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి, ఉమ్మడి మండలానికి చెందిన బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు నర్సింగరావు, అశోక్ కుమార్, రాజిరెడ్డి, సుధాకర్, పల్నాటి శ్రీనివాస్‌తో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



### మధ్యాహ్న భోజన నిర్వాహకుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

- **ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం**

**వుదయం ప్రతినిధి,కీసర అక్టోబర్ 26,**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న నిర్వాహకుల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి కోరారు.సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పేద విద్యార్థుల చదువు,పోషణకు ఆటంకం కలగకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నప్పటికీ, నిర్వాహకులు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు.గత నాలుగు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.నిత్యావసర సరుకుల కొనుగోలు,రోజువారీ ఖర్చుల నిర్వహణ భారంగా మారిందని పేర్కొన్నారు.విద్యార్థులకు ప్రతిరోజూ మధ్యాహ్న భోజనం అందిస్తూ విద్యా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న నిర్వాహకుల సమస్యలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఉమ్మడి కీసర మండల పరిధిలో పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల బిల్లులను వెంటనే విడుదల చేసి,నిర్వాహకులకు ఆర్థిక ఇబ్బందులు తొలగించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని చంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## బిజెపి మండల అధ్యక్షులుగా పాలది శ్రీనివాస్

**కేశంపేట**

భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులుగా పాలది శ్రీనివాస్ గుప్తాను జిల్లా అధ్యక్షులు పతంగి రాజగోపాల్ గౌడ్ నియమించినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. గతంలో పార్టీ అధ్యక్షులుగా పనిచేసిన రోళ్ళ రాధిక రాజీనామా చేయడంతో కాళీ ఏర్పడింది. నూతన అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు ఆశయాలకు కట్టుబడి పార్టీ ఆదేశానుసారం గ్రామీణ ప్రాంతాలలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. నాపై విశ్వాసంతో



బాధ్యతలు వచ్చేందుకు ప్రోత్సహించిన నాయకులు శ్రీ వర్ధన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకటేష్ గుప్తా లకు కృతజ్ఞతలు తెలిపారు....

## మందాడి అంజన్ కుమార్ యాదవ్‌కు ఘన సన్మానం





**సదర్ సమ్మేళనం విజయవంతం కావాలని ఆకాంక్షించిన షాద్ నగర్ కాంగ్రెస్, యాదవ సంఘం నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్**

**హైదరాబాద్**లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మాజీ ఎంపీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మందాడి అంజన్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభ సభ్యుడు మందాడి అనిల్ కుమార్ యాదవ్ లను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అక్టోబర్ 4, 2026న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న సదర్ సమ్మేళనానికి మందాడి అంజన్ కుమార్ యాదవ్ అధ్యక్షత వహించనున్న నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో షాద్‌నగర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, యాదవ సంఘం నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్‌తో పాటు మాజీ కార్పొరేటర్ కల్పన యాదవ్, చప్పల్ బజార్ కార్పొరేటర్ వాసు యాదవ్, వట్టెల లింగం యాదవ్, సురేష్ యాదవ్, షాద్ నగర్ యాదవ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. నవంబర్ 4 తేదీ ఉదయం 11 గంటలకు హైదరాబాదులోని ఇందిరాపార్కు దగ్గర జరగబోయే యాదవ సదర్ సమ్మేళానికి షాద్ నగర్ తాలూకా యాదవ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని సదర్ సమ్మేలం విజయవంతం చేయాలని కోరారు.

### నార్సింగిలో రీస్టోర్ వెల్నెస్ క్లినిక్ ను ప్రారంభించిన బిజెపి కాన్స్టెంట్ ఎంపీ అభ్యర్థి మాధవి లత



రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండల్ నార్సింగి సుమీ రెసిడెన్సి లో నూతనంగా ఏర్పాటుచేసిన రిజిస్టర్ వెల్నెస్ క్లినిక్ ను ఓల్డ్ సిటీ బిజెపి పార్లమెంటు అభ్యర్థి మాధవి లత ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజలను చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు మంచి సేవలు అందించి వారి మండలాలు పొందే విధంగా సేవలు ఉండాలని ఉన్నారు ఈ సందర్భంగా క్లినిక్ ప్రొఫైల్ జ్యోతి మరియు వారి కుటుంబ సభ్యులను అభినందించారు.



"న్యూఢిల్లీలో నవంబరు 1న ర్యాలీని షెడ్యూల్ చేశాం. దీనిపై వర్తక సంఘాలు అప్పీల్ చేశాయి. వారి అభ్యర్థనపై ఈ రోజు లేదా రేపటిలోగా పార్టీ నాయకత్వం చర్చించి ఓ నిర్ణయం తీసుకుంటాం. మేం చేసే ఈ ఆందోళన ప్రజల కోసమే. ఓటు చోరీ అనేది చాలా తీవ్రమైన అంశం. ప్రజలకు ఓటు వేసే హక్కు లేకపోతే ఏ వర్తకుడు కూడా వ్యాపారం చేసుకోలేరు. భవిష్యత్తు కోసం కలలు కనే విద్యార్థులకు ఎలాంటి సాయం అందదు."

- మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అధ్యక్షుడు

## వే'మన' పద్యం

అనువుగాని చోటనధికులమనరాదు
గొంచమైన నదియు గొదువగాదు
కొండ యద్దమందు గొంచెమైయుండదా!
విశ్వదాభిరామ వినురవేమ



# సంపాదకీయం

## భారతీయ ఆత్మకు పునర్జీవనం ఎప్పుడు?

భారత రాజకీయాల్లో నేడు చోటుచేసుకుంటున్న పరిణామాలను కేవలం అధికార, ప్రతిపక్షాల మధ్య జరిగే రాజకీయ పోరాటంగా మాత్రమే చూడలేం. ఇవి దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ స్వరూపాన్ని, పౌర స్వేచ్ఛల భవిష్యత్తును, రాజ్యాంగ విలువల పట్ల పాలకుల నిబద్ధతను ప్రశ్నిస్తున్న పరిణామాలు. అధికార కేంద్రీకరణ, నిరసనలపై ఆంక్షలు, విమర్శకులపై చట్టాల ప్రయోగం, యువతలో పెరుగుతున్న అసంతృప్తి.. ఇవన్నీ భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న అంతర్గత సవాళ్ల తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయాల్లో భారతీయ ఆత్మకు ఉన్న స్థానం ఏమిటన్న ప్రశ్న ప్రాధాన్యం సంతరించుకుంటోంది. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించి దశాబ్దాలు గడిచినా, పాలనా యంత్రాంగంలోనూ, పోలీసు వ్యవస్థలోనూ వలస పాలన నాటి అధికార ధోరణులు పూర్తిగా తొలగిపోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజలను సేవించాల్సిన వ్యవస్థలు ప్రజలపైనే అధికారాన్ని ప్రదర్శించే పరిస్థితులు ప్రజాస్వామ్యానికి ఆందోళనకరం. శాంతియుతంగా నిరసన తెలిపే విద్యార్థులు, మహిళలు, సామాజిక కార్యకర్తలపై బలప్రయోగం జరిగినప్పుడు అది కేవలం శాంతిభద్రతల అంశంగా మిగిలిపోదు; పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణకు సంబంధించిన ప్రశ్నగా మారుతుంది.ప్రజాస్వామ్యంలో జాతీయ భద్రతకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ, ఆ పేరుతో పౌర స్వేచ్ఛలను నిరవధికంగా పరిమితం చేయడానికి వీల్లేదు భీమా కోరేగావ్ కేసులో నిందితులు, షార్జీల్ ఇమామ్, ఉమర్ ఖలీద్ వంటి వారి కేసులు విచారణకు ముందున్న నిర్బంధం, వ్యక్తిగత స్వేచ్ఛ, న్యాయ ప్రక్రియలో జాప్యం వంటి అంశాలపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తాయి. అయితే, ప్రతి కేసులోని ఆరోపణలు, న్యాయస్థానాల పరిశీలనలు, వ్యక్తిగత బాధ్యతలను వాటి ప్రత్యేక వాస్తవాల ఆధారంగానే అంచనా వేయాలి. .కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వాల కాలంలో ప్రవేశపెట్టిన లేదా విస్తరించిన కొన్ని చట్టాలను నేటి పాలకులు కూడా ఉపయోగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలో ఒక పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సమర్థించిన నిర్బంధ అధికారాలను, ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత మాత్రమే తప్పుబట్టడం రాజకీయ నైతికతకు పరీక్ష. పౌర హక్కుల విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు తావుండకూడదు.జాతీయ జెండా దేశ ప్రజలందరి సమష్టి గౌరవానికి ప్రతీక. , సంస్థల స్వతంత్రతను గౌరవించడం కూడా. ప్రభుత్వాన్ని విమర్శించడం దేశాన్ని వ్యతిరేకించడం కాదనే ప్రజాస్వామ్య సూత్రాన్ని పాలకులూ, ప్రతిపక్షాలూ సమానంగా అర్థం చేసుకోవాలి.అయితే, ప్రతి నిరసనలోనూ ఒకే రాజకీయ ఉద్దేశం ఉంటుందని భావించడం ఎంత తప్పో, ప్రతి ప్రభుత్వ చర్యనూ అణచివేతగా అభివర్ణించడం కూడా అంతే సరికాదు. సంఘటనలను వాస్తవాల ఆధారంగా పరిశీలించడం, చట్టబద్ధమైన నిరసనకు రక్షణ కల్పించడం, హింసకు తావులేకుండా ప్రజాస్వామ్య సంభాషణను ప్రోత్సహించడం సమతుల్యమైన పాలనకు అవసరం. ప్రపంచం ముందు బలమైన దేశంగా నిలవాలంటే, దేశంలోని ప్రతి పౌరుడికి భద్రత, న్యాయం, సమాన అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వంపై విమర్శలు చేసే వ్యక్తికి కూడా చట్టపరమైన రక్షణ ఉంటుందనే విశ్వాసం కల్పించాలి. నిరసనలను బలప్రయోగంతో అణచివేయడం తాత్కాలికంగా పరిస్థితిని అదుపులోకి తీసుకురావచ్చు. . భారతీయ ఆత్మ అనేది ఒక పార్టీకి, ఒక సిద్ధాంతానికి లేదా ఒక వర్గానికి మాత్రమే చెందినది కాదు. భిన్నత్వంలో ఏకత్వం, సహనం, సహజీవనం, న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ వంటి విలువల సమాహారమే భారతీయ సమాజపు నిజమైన బలం. అధికారాన్ని ప్రశ్నించే పౌరుడిని శత్రువుగా కాకుండా ప్రజాస్వామ్య భాగస్వామిగా చూడగలిగినప్పుడే ఈ విలువలకు సార్థకత చేకూరుతుంది.అవినీతి, అధికార దుర్వినియోగం, రాజకీయ ప్రతీకారాలు, పాతకాలపు అధికార ధోరణులు ఏ రూపంలో ఉన్నా వాటిని తిరస్కరించాలి. ప్రభుత్వాలు మారడం మాత్రమే వ్యవస్థాగత మార్పునకు హామీ కాదు. పాలనా సంస్కృతిలో మార్పు రావాలి. చట్టం ముందు అందరూ సమానులనే భావన ఆచరణలో కనిపించాలి. పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా పనిచేయాలి. న్యాయ ప్రక్రియలో జాప్యం తగ్గాలి. యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలి. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రజలకు నిర్భయంగా ఉండాలి.భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు అధికార పక్షం విజయాలపైనా, ప్రతిపక్షాల రాజకీయ వ్యూహాలపైనా మాత్రమే ఆధారపడలేదు. రాజ్యాంగ విలువలను ఎంతగా గౌరవిస్తున్నాం, పౌరుల స్వేచ్ఛను ఎంత సమర్థంగా పరిరక్షిస్తున్నాం, విభేదాలను ఎంత ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కరిస్తున్నాం అనే అంశాలే దాని అసలు కొలమానాలు.

### రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

ఆదివాసీలపై నిజాం నవాబు సాగించిన దోపిడీకి వ్యతిరేకంగా, పాలక వర్గాల దౌర్జన్యాలను ప్రశ్నిస్తూ, గిరిజన హక్కుల కోసం 'జల్ జంగిల్‌జమీన్' నినాదంతో మడమ తిప్పని పోరాటాలు చేసి, ప్రాణాలర్పించిన పోరాట యోధుడు కొమురం భీం.

గిరిజన గోండు తెగకు చెందిన కొమురం చిన్నూమ్, సోంబాయి దంపతులకు 1901 అక్టోబర్ 22న అవిభక్త ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి గ్రామంలో జన్మించి, ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టలు కేంద్రంగా నిజాం నవాబుపై గెరిల్లా పోరాటాన్ని కొనసాగించి, కుర్దు పటేల్ అనే నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో, అర్ధరాత్రి కొమరం స్థావరాలను సైన్యం చుట్టుముట్టగా జోడేఘాట్ అడవుల్లో 1940, అక్టోబర్ 27 న, అంటే ఆదివాసీలు పవిత్రంగా భావించే ఆశ్వీయుజ శుద్ధ పౌర్ణమి రోజున వీరమరణం పొందాడు భీం.కొమురం భీం స్ఫూర్తితో...దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు ,తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు.



నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది.ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి . స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో కేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది కూడా. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నది. అలా గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యం. అత్యవసరం.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# క్షీణిస్తున్న రుతుపవనాలతో పెరగాల్సిన సంసిద్ధత

ప్రకృతి తన గమనాన్ని మార్చుకుంటున్న వేళ వర్షాకాలాన్ని ఇక పాత కొలమానాలతో మాత్రమే అంచనా వేయలేం. ఎక్కడో వర్షాభావం, మరెక్కడో కొద్ది రోజుల్లోనే భారీ వర్షం... ఈ వైవిధ్యం వ్యవసాయం నుంచి జలవనరుల నిర్వహణ వరకు కొత్త సవాళ్లను ముందుకు తెస్తోంది. ముఖ్యంగా నైరుతి రుతుపవనాలు లోటుతో ముగిసిన 2026లో, దక్షిణ భారతానికి కీలకమైన ఈశాన్య రుతుపవనాలు ఆశతో పాటు అప్రమత్తత అవసరాన్నీ గుర్తుచేస్తున్నాయి.

ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు దేశవ్యాప్తంగా 759.4 మిల్లీమీటర్ల నైరుతి రుతుపవన వర్షపాతం నమోదైంది. సాధారణంగా నమోదయ్యే 868.6 మిల్లీమీటర్లతో పోలిస్తే ఇది 12.6 శాతం లోటు. ముఖ్యంగా దక్షిణ ద్వీపకల్పంలో వర్షపాతం దీర్ఘకాల సగటులో 76 శాతానికే పరిమితమైంది. అంటే దాదాపు 24 శాతం లోటు నమోదైంది. ఈ గణాంకాల నేపథ్యంలో ఈశాన్య రుతుపవనాల ప్రాధాన్యం మరింత పెరుగుతోంది.

2026 అక్టోబర్‌డిసెంబర్ మధ్య దక్షిణ ద్వీపకల్పంలో ఈశాన్య రుతుపవన వర్షపాతం సాధారణ స్థాయిలో, అంటే లాంగ్ పీరియడ్ యావరేజ్‌లో 88 నుంచి 112 శాతం మధ్య ఉండే అవకాశం ఉంది. ఈ ప్రాంతానికి ఈ మూడు నెలల దీర్ఘకాల సగటు వర్షపాతం 334.13 మిల్లీమీటర్లు.

అయితే 'సాధారణ వర్షపాతం' అంటే అన్ని ప్రాంతాల్లోనూ సమానంగా వర్షం కురుస్తుందని భావించకూడదు. ఒక ప్రాంతంలో లోటు, మరో ప్రాంతంలో అధిక వర్షం, ఇంకోచోట కొద్దిరోజుల్లోనే భారీ వర్షపాతం నమోదు కావచ్చు. ఈ అసమానతే వ్యవసాయం, నీటి నిర్వహణ, పట్టణ ప్రణాళికకు అసలు సవాలు. పైగా ఉష్ణోగ్రతల్లో మార్పులు, ఎల్‌నినో వంటి సముద్ర వాతావరణ పరిణామాలు రుతుపవనాల స్వభావాన్ని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి.

అందుకే ఇప్పుడు అవసరమైనది వర్షం కోసం ఎదురుచూడటం కాదు, వర్షానికి సిద్ధపడటం. ప్రాంతాలవారీ వాతావరణ అంచనాలను పంటల ఎంపిక, విత్తే సమయం, సాగునీటి ప్రణాళికతో అనుసంధానించాలి. రైతులకు ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ సమాచారం అందుబాటులో ఉండాలి. చెరువులు, కుంటలు, జలాశయాల్లో వర్షపు నీటిని సాధ్యమైనంతగా నిల్వ చేసి, వర్షాభావ సమయంలో ఉపయోగించుకునే వ్యవస్థలను బలోపేతం చేయాలి.

అదే సమయంలో భారీ వర్షాన్ని కూడా ఒక ముందస్తు నిర్వహణ అంశంగానే చూడాలి. పట్టణాల్లో డ్రైనేజీ వ్యవస్థలు, వరదనీటి మార్గాలు సమర్థంగా పనిచేసేలా చూడటం, గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, కాలువలు, చిన్న జలవనరుల నిర్వహణకు నిరంతర ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. ముందస్తు వాతావరణ హెచ్చరికలు చివరి గ్రామంలోని రైతు వరకు సకాలంలో చేరినప్పుడే సాంకేతిక పరిజ్ఞానం నిజమైన ప్రయోజనం అందిస్తుంది.

వాతావరణ మార్పులను మనం ఆపలేకపోవచ్చు. కానీ వాటి ప్రభావాన్ని ఎదుర్కొనే సామర్థ్యాన్ని మాత్రం పెంచుకోగలం. వర్షాభావంలో నీటిని ఆదా చేయడం, అధిక వర్షంలో నీటిని ఒడిసిపట్టడం,



సి. హెచ్.ప్రతాప్
77938 00743

# అలాగే పోతాం..!

గడియారంలోని చిన్న
ముల్లు..
సమయాన్ని నిర్ణయిస్తుంది
మన చిన్న చిన్న అలవాట్లే..
మన వ్యక్తిత్వాన్ని
ఇనుమడిస్తాయి !
పెద్దగా గట్టిగా వృధాగా
అరిస్తే..
అబద్ధం ఎన్నటికీ నిజం కాదు
కదా
చిన్నగా మెల్లగా
అర్థవంతంగా..
మాట్లాడితేనే సదా
ఆకర్షణీయం !

సూది వలె కష్టమైనా
దూరుతూ..
సంబంధాల దారాన్ని
లాగుతూ..
ముక్కలైన మనసును
కలుపుదాం
జీవితంలో కలిసి ఉంటే కలదు
సుఖం !
ఓటమితో బంధం
బలపడితే..
మనస్ఫూర్తిగా ఓటమిని
అంగీకరిద్దాం
బంధాలను నిలుపుకోవడం
ఆనందం

సంపదలు బంధాలను
కొనలేదు కదా !
ముఖంపై చిరునవ్వుల
నాట్యం
మనసులో బాధల సునామీ..
జీవితం ఇలాగే సాగుతుంది
వాటిని ఎవరూ
తప్పించుకోలేరు !
అర్థం చేసుకోవడం నేర్చుకో
అపార్థాలు పొంచి ఉంటాయి
జాగ్రత్త

మనసులో సంబంధాలు
విడిపోయి..
మనుషుల నడుమ గోడలు
నిలుస్తాయి !
బలహీనంగా వచ్చాం అలాగే
పోతాం
ఖాళీ చేతులతో వచ్చాం
అలాగే పోతాం
ఏడుస్తూ వచ్చాం ఏడిపిస్తూ
పోతాం
నగ్నంగా వచ్చాం నగ్నంగానే
పోతాం !

కాలంతో పాటు మార్పు
సహజం
మార్పుకు మన అనుమతి
అక్కర్లేదు
మన శరీరమే క్షణక్షణం
మారుతోంది
మనుషులు, మనసులు
మాత్రం మారరా !
కొన్ని బంధాలను
మదిలించుకోవాలి
కొన్నింటిని సమీరా
వదులుకోవద్దు
బంధాల ముడులే ఆనంద
తీరాలు
సంతోషం కరువైతే కన్నీటి
సంద్రాలు !
వచ్చి పోవడానికి కాదు ఈ
జన్మ..
చచ్చిపోయినా జన
నాలుకల్లో..
నానడానికి ఈ అద్భుత
జీవితం
పోతాం అని తెలిసి ఎన్నడా
దిగజారకు !



మధుసూదన్ రెడ్డి
9949700037



# జాతీయం-అంతర్జాతీయం






## రాహుల్ గాంధీకి త్రుటిలో తప్పిన ప్రమాదం

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోమవారం త్రుటిలో కారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. యూపీలోని సుల్తాన్‌పూర్ వెళ్తుండగా పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వేపై ఆయన కాన్వాయ్‌లోని 5 కార్లు, ఒక అంబులెన్స్ ఒకదాన్ని ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదం నుండి రాహుల్‌గాంధీ సురక్షితంగా బయటపడ్డారు. అమిత్ షాపై గతంలో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసులో కోర్టుకు హాజరయ్యేందుకు సుల్తాన్‌పూర్ వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు సభ్యులు, భద్రతా సిబ్బంది గాయపడినట్లు సమాచారం.

రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న వాహనం కాన్వాయ్‌లో ముందు ఉండటంతో, ఆయన ప్రమాదం నుండి బయటపడ్డారు.

# చైనా సైనికుల త్యాగం మరువలేనిది

- ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ నివాళి
- ఉమ్మడిగా సోషలిస్టు లక్ష్యాలను చేరుకుంటామని ప్రకటన

**బీజింగ్:** ఉత్తర కొరియా (డిపిఆర్‌కె) అగ్రనేత కిమ్ జోంగ్ ఉన్ చైనాలో పర్యటించారు. ఈ సందర్భంగా కిమ్ మాట్లాడుతూ అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా కొరియా యుద్ధంలో చైనా సైనికులు చేసిన త్యాగం మరువలేనిదని అన్నారు. శనివారం ఈశాన్య చైనాలోని లియావోనింగ్ ప్రావిన్స్‌కు చెందిన సరిహద్దు నగరం డాండాంగ్‌లో కిమ్ పర్యటించారు. ఈ సందర్భంగా కిమ్, షీ జిన్‌పింగ్‌కు తన ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేశారు. చైనా కమ్యూనిస్ట్ పార్టీ 20వ కేంద్ర కమిటీ ఐదో ప్లీనరీ సమావేశం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కీలకమైన చారిత్రక సందర్భంలో ఉత్తర కొరియాకు మద్దతుగా ప్రాణ త్యాగం చేసిన చైనా పీపుల్స్ వాలంటీర్ల అమరులకు నివాళులర్పించేందుకు, ఆ వీరుల పట్ల తమ దేశ హృదయపూర్వక కృతజ్ఞతను, శాశ్వత గౌరవాన్ని తెలియజేసేందుకే డాండాంగ్ వచ్చానని కిమ్ చెప్పారు. ఈ ఏడాది జూన్‌లో షీ జిన్‌పింగ్ ఉత్తర కొరియాలో చేసిన చారిత్రక పర్యటన, ఇరు దేశాల సంబంధాలకు ఉన్న అత్యంత ప్రాధాన్యాన్ని చాటిందని, ద్వైపాక్షిక బంధంలో అది మైలురాయి అని అన్నారు. ఇరు దేశాల మధ్య సహకారానికి అవకాశాలు చాలా విస్తృతంగా ఉన్నాయని పేర్కొన్నారు. షీ జిన్‌పింగ్ నాయకత్వంలో చైనా ప్రజలు సాధించిన విశేష అభివృద్ధిని, అంతర్జాతీయంగా చైనాకు దక్కిన ప్రాధాన్యాన్ని ఉత్తర కొరియా ప్రశంసిస్తోందని కిమ్ అన్నారు. చారిత్రక స్నేహాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, ఆచరణాత్మక సహకారాన్ని విస్తరించేందుకు, ఇరు దేశాల ప్రజలకు స్పష్టమైన ప్రయోజనాలు చేకూర్చేందుకు చైనాతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.



చైనా రాజకీయ సలహా మండలి (సిపిపిసిసి) జాతీయ కమిటీ ఛైర్మన్, చైనా కమ్యూనిస్ట్ పార్టీ పొలిట్‌బ్యూరో స్టాండింగ్ కమిటీ సభ్యుడు వాంగ్ హునింగ్ ఆయన వెంట ఉన్నారు. వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా ప్రధాన కార్యదర్శి, ఆ దేశ స్టేట్ అఫైర్స్ అధ్యక్షుడైన కిమ్‌కు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తరఫున ఆత్మీయ శుభాకాంక్షలను వాంగ్ తెలియజేశారు. శనివారం ఉదయం ''అమెరికా దురాక్రమణను ఎదిరించి, కొరియాకు సాయం చేసిన యుద్ధ స్మారక భవనం'' ప్రాంగణంలో కిమ్‌కు వాంగ్ స్వాగతం పలికారు. ఇద్దరూ కలిసి స్మారక స్తూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా వాంగ్ మాట్లాడుతూ, ఇరు దేశాలు స్నేహం, పరస్పర సహకారంతో ఉమ్మడిగా సోషలిస్టు లక్ష్యాలను చేరుకుంటామని స్పష్టం చేశారు. అమెరికా దురాక్రమణను ప్రతిఘటించి, కొరియా యుద్ధంలో పోరాడేందుకు చైనా పీపుల్స్ వాలంటీర్లు ఉత్తర కొరియాలో అడుగుపెట్టి 76 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా కిమ్ ప్రత్యేకంగా డాండాంగ్ రావడం, పోరాటంలో పెనవేసుకున్న చైనా, ఉత్తర కొరియా స్నేహానికి ఆ దేశ పార్టీ, ప్రభుత్వం ఎంత విలువ ఇస్తున్నాయో చాటుతోందన్నారు. ఈ పర్యటన సంప్రదాయ స్నేహాన్ని ముందుకు తీసుకెళ్తుందని, స్నేహానికి ప్రజల మద్దతును బలోపేతం చేస్తుందని, రాజకీయ పరస్పర విశ్వాసాన్ని పెంచి సహకారం, అభివృద్ధిని ముందుకు నడిపిస్తుందని చెప్పారు. గత ఏడాది సెప్టెంబర్‌లో, ఈ ఏడాది జూన్‌లో షీ జిన్‌పింగ్, కిమ్ ఒకరి దేశంలో మరొకరు చారిత్రక పర్యటనలు చేసి అనేక కీలక అంశాల్లో ఏకాభిప్రాయానికి వచ్చారని, ఇవి ఇరు దేశాల సంబంధాలను కొత్త చారిత్రక దశలోకి తీసుకెళ్లాయని వాంగ్ పేర్కొన్నారు. ఇరు పార్టీల, దేశాల అగ్రనేతల మధ్య కుదిరిన ఏకాభిప్రాయాన్ని దృఢంగా అమలు చేసేందుకు, ఉమ్మడి సోషలిస్టు లక్ష్యాన్ని బంధంగా చేసుకుని సంబంధాలను మరింత అభివృద్ధి చేసేందుకు చైనా సిద్ధంగా ఉందని తెలిపారు.

యాలు నదిపై నిర్మించిన కొత్త చైనా-ఉత్తర కొరియా వంతెన ప్రారంభాన్ని అవకాశంగా తీసుకుని, ప్రజల రాకపోకలను, వాణిజ్య సహకారాన్ని విస్తరించి ఇరు దేశాల ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చాలని వాంగ్ సూచించారు. సార్వభౌమత్వం, భద్రత, అభివృద్ధిని కాపాడుకునేందుకు శాంతియుత, స్థిరమైన బాహ్య వాతావరణాన్ని సృష్టించేలా వ్యూహాత్మక సంప్రదింపులను, సమన్వయాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం వాంగ్, కిమ్ కలిసి డాండాంగ్‌లోని ఒక కార్ల ఫ్యాక్టరీని సందర్శించారు. ఉత్పత్తి విభాగాన్ని పరిశీలించి, అక్కడి అధికారుల వివరణ విన్నారు. కిమ్ డాండాంగ్ నుంచి తిరుగు ప్రయాణమైనప్పుడు, యాలు నదిపై ఉన్న కొత్త వంతెన వద్ద వాంగ్ ఆయనకు వీడ్కోలు పలికారు.

## 2018 నాటి పరువునష్టం కేసులో
# రాహుల్ గాంధీ నిర్దోషి



**లక్నో :** 2018నాటి పరువునష్టం కేసులో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉపశమనం లభించింది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాపై 2018లో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువునష్టం కేసులో సుల్తాన్‌పూర్ జిల్లాలోని ఎంపి/ఎమ్మెల్యే కోర్టు సోమవారం రాహుల్ గాంధీని నిర్దోషిగా ప్రకటించింది. ''కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బెంగళూరులో చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువు నష్టం కేసును సుల్తాన్‌పూర్‌లోని ప్రత్యేక ఎంపీఎమ్మెల్యే కోర్టు జడ్జి జస్టిస్ శుభం వర్మ కొట్టివేశారు'' అని ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా విభాగం ఛైర్మన్ కున్వర్ సింగ్ నిషాద్ తెలిపారు.2023లో రాహుల్‌గాంధీ కోర్టుకు హాజరై బెయిల్ పొందారు. ఈ కేసులో అక్టోబర్ 13న తీర్పు వెల్లడించనున్నట్లు కోర్టు గతంలో ప్రకటించింది. అనంతరం ఆ తేదీని అక్టోబర్ 26కి మార్చింది.ఈ కేసు విచారణకు హాజరయ్యేందుకు ఆయన సోమవారం ఉదయం లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం సుల్తాన్‌పూర్ బయలుదేరారు. సుల్తాన్ పూర్ వెళుతుండగా పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ వేపై ఆయన కాన్వాయ్ ప్రమాదానికి గురైంది. అయితే, ఈ ప్రమాదం నుండి రాహుల్ తృటిలో తప్పించుకున్నారు. కాన్వాయ్‌లో ఉన్న వాహనాల్లో ఒకటి అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుకనున్న వాహనాలు ఒకదానినొకటి ఢీకొన్నాయని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్యార్థుల నిరసనకు దిగివచ్చిన జామియా మిలియా యాజమాన్యం ..



**న్యూఢిల్లీ :** విద్యార్థుల నిరసనకు జామియా మిలియా ఇస్లామియా యూనివర్శిటీ యాజమాన్యం దిగివచ్చింది. విద్యార్థి సంఘం రాజ్యాంగానికి ఆమోదం లభించిన 15 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహిస్తామని జామియా మిలియా ఇస్లామియా సోమవారం ప్రకటించింది. విద్యార్థులకు జారీ చేసిన సస్పెన్షన్ మరియు షోకాజ్ నోటీసులను యూనివర్శిటీ రద్దు చేసింది. అలాగే, యాజమన్యంపై చేసిన పరువునష్టం కలిగించే వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని విద్యార్థులను కోరింది. రెండు వారాలుగా విద్యార్థులు నిరాహారదీక్ష చేపడుతున్న సంగతి తెలిసిందే. ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించిన యాజమాన్యం, వైస్‌ఛాన్సలర్, చీఫ్ ప్రొక్టర్ రాజీనామాలపై ఎలాంటి హామీ ఇవ్వలేదు. దీంతో ఇద్దరు విద్యార్థులు తమ నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. నిరసన సమయంలోభద్రతా సిబ్బంది ప్రవర్తనపై విచారణ జరిపేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని రిజిస్ట్రార్ ఎండి మహతాబ్ ఆలం రిజ్వీ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఎన్నికలపై నిర్వహణపై స్పష్టతనివ్వాలని

, తమ యూనియన్‌ను పునరుద్ధరించాలని కోరుతూ యూనివర్శిటీ విద్యార్థులు అక్టోబర్ 11 నుంచి నిరసన తెలుపుతున్నారు. నిరసన చేస్తున్న విద్యార్థులను బలవంతంగా తొలగించేందుకు ప్రయత్నాలు జరగడంతో ఆదివారం పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. తరగతులను నిలిపివేయడంతో పాటు, క్యాంపస్‌లో నీటి సరఫరాను నిలిపివేశారు. ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. భారీగా పోలీసులను మోహరించినప్పటికీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో గుమిగూడి నిరసన చేపట్టారు.





## విద్యార్థుల చేతుల్లో అలెగ్జాండర్ వుచిచ్ పరాజయం

**బెల్గ్రేడ్ :** సెర్బియాలో ఆదివారం జరిగిన ముందస్తు పార్లమెంటరీ ఎన్నికల్లో అలెగ్జాండర్ వుచిచ్ పరాజయం పాలయ్యారు. దశాబ్దానికి పైగా సెర్బియా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన ఆయనను విద్యార్థుల ఉద్యమం ఓడించింది. హోరాహోరీ పోరు తర్వాత, 30 ఏళ్లకు పైగా అత్యధిక స్థాయిలో ఓటింగ్ శాతం నమోదైన ఆదివారం నాటి ఎన్నికలలో, వుచిచ్ విద్యార్థుల చేతిలో తన ఓటమిని అంగీకరించారు. ''మనం ఈ ఎన్నికల్లో ఓడిపోయామన్నది స్పష్టమైంది'' సెర్బియన్ ప్రొగ్రెసివ్ పార్టీ (ఎస్ఎన్ఎస్) నేత అలెగ్జాండర్ వుచిచ్ తన మద్దతుదారులతో పేర్కొన్నారు. 250 సీట్లు కలిగిన పార్లమెంటులో ఆయన పార్టీకి 105 స్థానాలు లభించే అవకాశం ఉండగా, స్టూడెంట్ లిస్ట్ 135 నుండి 140 స్థానాలను గెలుచుకునే అవకాశం ఉందని అన్నారు.

2024 నవంబర్ 1న నోవి సాద్ నగరంలో రైల్వే స్టేషన్ పైకప్పు కూలిపోవడంతో 16మంది మరణించిన ఘటన తర్వాత, ఈ విద్యార్థి ఉద్యమం ప్రారంభమైన సంగతి తెలిసిందే. యువత నేతృత్వంలోని ఈ నిరసనలు దేశవ్యాప్తంగా తీవ్రమయ్యాయి. అవినీతిని నిర్మూలించడం, ప్రభుత్వ సంస్థలను రాజకీయాలకు అతీతంగా ఉంచడం, పౌరుల హక్కులను పునరుద్ధరించడం వంటి వాగ్దానాలు చేసిన 'స్టూడెంట్ లిస్ట్' అనే రాజకీయ వేదికగా రూపుదిద్దుకుంది. నోవి సాడ్‌లోని వైద్య విభాగంలో ప్రొఫెసర్ అయిన ఇలియా డ్రనోవిచ్ ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు. "ఇక సెర్బియా ఒక స్వేచ్ఛాయుతమైన దేశం అవుతుంది'' అని ప్రధాన అభ్యర్థి ఇలియా డ్రానోవిచ్ అన్నారు. యూనివర్శిటీ ప్రొఫెసర్లు, వైద్యులు, కార్మికులతో కూడిన ప్రదర్శనకారులను వుచిచ్ "దిగ్బంధకులు"గా అభివర్ణించి, వారు సెర్బియాను అస్థిరపరిచేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. వుచిచ్ రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా పనిచేశారు. మూడవసారి పోటీ చేయలేకపోయారు. దీంతో 2017లో ప్రధాని పదవిని చేపట్టాలనే లక్ష్యంతో సెర్బియన్ ప్రోగ్రెసివ్ పార్టీ (ఎస్ఎన్ఎస్)కి నేతృత్వం వహించారు.

## ధనుష్ దీపావళి గిఫ్ట్‌లపై 'కమలం' గుర్తు
## పొలిటికల్ ఎంట్రీపై క్లారిటీ ఇచ్చిన ఫ్యాన్స్!

**చెన్నై :** దీపాలపై కమలం గుర్తు.. హాట్ టాపిక్‌గా ధనుష్ గిఫ్ట్‌లు

తమిళ స్టార్ హీరో ధనుష్ రాజకీయాల్లోకి వస్తారనే ప్రచారం మరోసారి తెరపైకి వచ్చింది. మహిళా అభిమానులకు ఆయన బహుమతిగా ఇచ్చిన వెండి దీపాలపై కమలం గుర్తు కనిపించడంతో తమిళనాడు రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. అయితే, ఆ గుర్తుకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదని ధనుష్ నర్పణి ఇయక్కం (ధనుష్ అభిమాన సంఘం) ప్రతినిధి స్పష్టం చేశారు.

చెన్నైలో నిర్వహించిన సమావేశంలో ధనుష్ (Dhanush) తన అభిమాన సంఘం మహిళా విభాగం సభ్యులను కలిశారు. దాదాపు 3000 మంది మహిళలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారితో ఫొటోలు దిగిన ఆయన.. దీపావళి కానుకగా వారందరికీ వెండి దీపాలను అందజేశారు. వాటిపై భాజపా ఎన్నికల గుర్తు అయిన కమలం ముద్ర ఉండటంతో రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. అయితే,



దీపాలపై ఉన్న కమలం గుర్తు తయారీదారుకు చెందిన ముద్ర మాత్రమేనని.. దానికి రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని ధనుష్ అభిమాన సంఘం ప్రతినిధి స్పష్టం చేశారు. మరోవైపు, ఈ వ్యవహారంపై కాంగ్రెస్ సహా కొందరు రాజకీయ నాయకులు వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది.

ఇక ధనుష్ 'తమిళగ ఎళుచ్చి కళగం' పేరుతో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రచారం జోరందుకుంది. ఆ పేరును ఎన్నికల సంఘం వద్ద నమోదు చేశారంటూ వార్తలు వచ్చాయి. ఇటీవల ఆయన అభిమాన సంఘం పేరును కూడా 'ధనుష్ నర్పణి ఇయక్కం' అని మార్చడం.. రాష్ట్రవ్యాప్తంగా కొత్త నిర్వాహకులను నియమించడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూర్చాయి.

## చైనా కమ్యూనిస్ట్ పార్టీ 5వ ప్లీనమ్ ప్రారంభం

**బీజింగ్ :** చైనా కమ్యూనిస్ట్ పార్టీ 5వ ప్లీనమ్ సమావేశాలు సోమవారం బీజింగ్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సమావేశాలు నాలుగు రోజుల పాటు కొనసాగుతాయి. ఈ కేంద్ర కమిటీ ప్లీనమ్‌కు జిన్‌పింగ్ నాయకత్వం వహిస్తున్నారు. పార్టీలో క్రమశిక్షణను బలోపేతం చేయడం, అవినీతిని అరికట్టడం, పాలనా సామర్థ్యాన్ని పెంచడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. ప్లీనమ్‌లో కేంద్ర కమిటీకి చెందిన సుమారు 300 మంది సభ్యులు పాల్గొంటున్నారు. అవినీతిని అరికట్టడంతో పాటు పార్టీ నాయకత్వం తీసుకునే నిర్ణయాలు కచ్చితంగా అమలయ్యేలా చూడటం, బాధ్యతల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం, పాలనా వ్యవస్థ సామర్థ్యాన్ని మెరుగుపరచడం వంటి అంశాలు కూడా ఈ సమావేశం పరిశీలనలో ఉన్నాయి. ప్లీనమ్‌లో పార్టీ భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించి షీ జిన్‌పింగ్ ముసాయిదా పత్రాన్ని సమర్పించారు. 2012లో అధికారంలోకి వచ్చినప్పటి నుండి జిన్‌పింగ్ అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. సీనియర్ అధికారులు, సైనిక అధికారులతో సహా పలువురిపై ఇప్పటివరకు చర్యలు తీసుకున్నారు. 2022లో ఏర్పాటైన ప్రస్తుత కేంద్ర కమిటీకి ఇది ఐదవ ప్లీనమ్. 2027లో జరగబోయే పార్టీ కాంగ్రెస్‌కు ముందు జరుగుతున్న కీలక సమావేశంగా ఈ ప్లీనమ్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది.




## అల్బేనియాలో విద్యార్థుల ఆగ్రహం

- అవినీతి, నిరుద్యోగం, నాసిరకం విద్యపై ఆందోళన

**తిరానా :** అల్బేనియాలో ప్రభుత్వ అవినీతి, నిరుద్యోగం, విద్యా ప్రమాణాల దిగజారుడుపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. శనివారం రాజధాని తిరానాలో నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు బాష్పవాయువు, నీటి ఫిరంగులు, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. నిరసనకారులు పోలీసులపై రాళ్లు రువ్వడంతో పాటు వ్యవసాయ మంత్రిత్వ శాఖ భవనం ద్వారం వద్ద నిప్పు పెట్టారు. ప్రధాని ఎడి రామా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఈ నెలలో చేపట్టిన నిరసనలు తిరానా నగరమంతటా విస్తరించడంతో పాటు ఇతర నగరాలకూ పాకాయి. ప్రభుత్వ భవనాలు, బ్యాంకులకు నిప్పు పెట్టడం, దుకాణాల అద్దాలు పగులగొట్టడం, రోడ్లపై రాళ్లు




పెకిలించి పోలీసులపై విసరడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. వేసవిలో వివాదాస్పద విలాసవంతమైన తీరప్రాంత అభివృద్ధి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా శాంతియుతంగా ప్రారంభమైన ఆందోళనలు ప్రస్తుతం తీవ్ర రూపం దాల్చాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నర్ మద్దతున్న ఈ ప్రాజెక్టుపై స్థానికుల్లోనూ వ్యతిరేకత ఉంది. 2013 నుంచి అధికారంలో ఉన్న రామా గతేడాది నాలుగోసారి ప్రధానిగా ఎన్నికయ్యారు. తాజా నిరసనలు ఆయన ప్రభుత్వానికి అతిపెద్ద సవాలుగా మారాయి. 'అల్బేనియా ప్రజలు మేల్కొన్నారు. ప్రజాస్వామ్యం ముసుగులో నియంతృత్వ పాలన సాగుతోంది' అని నిరసనకారుడు డేనియల్ తాహిరి వ్యాఖ్యానించారు. అవినీతి, కుంభకోణాలతో విసిగిపోయిన ప్రజలు ఇక రామా పాలనను కోరుకోవడం లేదని మరో నిరసనకారుడు ఒర్గెటా లికాజ్ అన్నారు.

# సూపర్ ట్యాంకర్లపై దాడులు

పశ్చిమాసియా ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచి హర్మూజ్ జలసంధి అల్లకల్లోలంగానే ఉంటోంది. ఈ మార్గంలో తరచూ చమురు నౌకలపై దాడులతో అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన ధరలు భగ్గుమంటున్నాయి. దాడులకు గురైన నౌకల్లో సూపర్ ట్యాంకర్లు కూడా ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘర్షణల్లో ) దాదాపు 3.5 శాతం సూపర్‌ట్యాంకర్లు ధ్వంసమైనట్లు మెరైన్ ట్రాఫిక్ డేటా గణాంకాలు వెల్లడిస్తున్నాయి.ఈ ఏడాది ఫిబ్రవరి చివరి నాటి నుంచి ఇప్పటివరకు హర్మూజ్ జలసంధిలో దాదాపు 30 వెరీ లార్జ్ క్రూడ్ క్యారియర్లు దాడుల కారణంగా



దెబ్బతిన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం వీఎల్‌సీసీ (900కు పైగా) నౌకల్లో ఈ సంఖ్య దాదాపు 3.5 శాతానికి సమానం. ఒక్క అక్టోబరు నెలలోనే 11 సూపర్ ట్యాంకర్లపై దాడులు జరిగినట్లు ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ (ఐఎంఓ) వెల్లడించింది. ఈ సూపర్ ట్యాంకర్ ఒక్కోటి 20 లక్షల బ్యారెళ్ల చొప్పున చమురు (Crude Oil) ను మోసుకెళ్తుంది. డిస్కౌంట్లు, రవాణా వ్యయాల వంటి కారణాలతో ఈ భారీ నౌకల్లో చమురు నింపేందుకు షిప్ యజమానులు ఆసక్తి చూపుతుంటారు. ఈ క్రమంలోనే ఉద్రిక్తతల సమయంలో ఈ ట్యాంకర్లు దాడులకు గురైనట్లు ఐఎంఓ వెల్లడించింది.ఇదిలా ఉండగా.. ఈ నెలలో హర్మూజ్‌లో వాణిజ్య నౌకలపై విపరీతమైన దాడులు జరిగాయి. యుద్ధం మొదలైన నాటి నుంచి అక్టోబరులోనే రికార్డు స్థాయిలో దాడులు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 28 నుంచి ఇప్పటివరకు ఈ జలమార్గంలో 130కి పైగా నౌకలు దెబ్బతిన్నాయి. ఇందులో ఒక్క అక్టోబరులోనే 28 నౌకలపై దాడులు జరిగినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అక్టోబరు 22న అయితే ఏకంగా ఒక్కరోజే ఏడు నౌకలను లక్ష్యంగా చేసుకోవడం గమనార్హం.

మరోవైపు, ఉద్రిక్తతల కారణంగా ఇటీవల రికార్డు స్థాయిలో పెరిగిన చమురు ధర సోమవారం స్వల్పంగా దిగొచ్చింది. నేటి ట్రేడింగ్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 115.19 డాలర్లకు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే ధర 1.3శాతం మేర తగ్గింది. ఇరాన్‌తో డీల్ కుదుర్చుకునేందుకు దౌత్య మార్గాలను అన్వేషిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన తర్వాత వీటి ధరలు స్వల్పంగా తగ్గాయి.

## నాలుగవ సారి బ్రెజిల్ అధ్యక్షుడిగా ఎన్నికై చరిత్ర సృష్టించిన లూలా

**బ్రసీలియా :** నాలుగవ సారి బ్రెజిల్ అధ్యక్షుడిగా ఎన్నికై లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా (80 ఏళ్లు) చరిత్ర సృష్టించారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో ఏ అభ్యర్థీ సాధించని రీతిలో లూలా రాజకీయంగా అద్భుతమైన పునరాగమనం సాధించారు." ట్రంప్ మద్దతున్న మాజీ అధ్యక్షుడు



బొల్సెనారో కుమారుడు, సెనేటర్ ఫ్లావియో ఓడిపోయారు. 2003 నుంచి 2011 వరకు అధ్యక్షుడిగా సేవలందించిన లూలా 2022లో మూడోసారి బాధ్యతలు చేపట్టారు. మితవాద పార్టీ దూకుడు, పెరిగిన ధరలు, అవినీతి సవాళ్లను ఎదుర్కొని తాజాగా మరోసారి అధికారం చేపట్టారు. ఫస్ట్ రౌండ్‌లో వెనకబడినా నాలుగో రౌండ్‌లో విజయం సాధించిన తొలి వ్యక్తిగా నిలిచారు. లూలా 51శాతానికి పైగా ఓట్లు సాధించగా, బొల్సెనారో 48శాతం ఓట్లు పొందారు.

# చక్కని ఆరోగ్యం

## బరువు తగ్గిన కొంతకాలానికే మళ్లీ పెరుగుతున్నారా?



ఈరోజుల్లో చాలామందిని అధిక బరువు సమస్య వేధిస్తోంది. దీన్నుంచి బయటపడాలంటే వ్యాయామం చేయడంతో పాటు ఆహార నియమాలు పాటించడం ఎంతో అవసరం. అలాగే శరీరానికి తగినంత విశ్రాంతి ఉంటేనే ఆశించిన ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు. అయితే వివిధ డైట్లు పాటించే క్రమంలో మొదట్లో కనిపించిన పురోగతి.. కొన్ని నెలల తర్వాత చాలామందిలో తగ్గిపోతుంటుంది. దీంతో వారు తమను తాము నిందించుకోవడం మొదలుపెడుతుంటారు. అయితే ఇందుకు వారు చేసే చిన్న చిన్న తప్పులే కారణమంటున్నారు. అవేంటో తెలుసుకుందాం రండి..

సాధారణంగా బరువు తగ్గాలనుకునే వారు.. తీసుకునే ఆహారంలో అవసరమైన వాటికంటే తక్కువ క్యాలరీలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. దీనివల్ల మొదట్లో సానుకూల ప్రయోజనాలు పొందుతుంటారు కూడా. కానీ, దీర్ఘకాలం ఇలా తక్కువ క్యాలరీలు తీసుకోవడం వల్ల శరీరం దీన్ని ప్రమాదకర సంకేతంగా గుర్తిస్తుంది. దాంతో శరీరం తనను తాను రిపేర్ చేసుకునే క్రమంలో జీవక్రియలు మందగించడం, ఆకలి ఎక్కువ వేయడం, శక్తి తగ్గిపోవడం, మూడ్ మారిపోతుండడం.. వంటి లక్షణాలు కనిపిస్తాయట. ఆకలి కోరికలు పెరగడం వల్ల తెలియకుండానే అతిగా తింటుంటారు. దానివల్ల సహజంగానే కొంతకాలం తర్వాత ఆశించిన ప్రయోజనాలను పొందలేకపోతుంటారు. అయితే వీటిని సహజ మార్పులుగానే గుర్తించాలంటున్నారు నిపుణులు. కొంతమంది ఒకే రకమైన ఆహార నియమాలను ఎక్కువకాలం పాటిస్తుంటారు. ఇలా చేయడం వల్ల శరీరంలో అనవసర కొవ్వులు కరగడం వంటి సానుకూల మార్పులు కనిపిస్తుంటాయి కూడా. కానీ, అదే డైట్‌ను ఎక్కువ రోజులు పాటించడం వల్ల శరీరం అందుకు తగ్గట్లుగా అలవాటుపడుతుంది. ఒక్కోసారి ఇది బరువు తగ్గే అంశం పైనా ప్రభావం చూపిస్తుంది. అందుకే పాటించే ఆహార నియమాలకు తగ్గట్లుగా శరీరం స్పందించాలంటే ఎప్పటికప్పుడు స్వల్ప మార్పులు చేసుకోవాలంటున్నారు నిపుణులు. ఇందులో భాగంగా ప్రత్యామ్నాయ ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు.

కొంతమంది డైట్ విషయంలో చాలా కఠినంగా ఉంటారు. అయితే ఇలా కఠినమైన ఆహార నియమాలు పాటించడం వల్ల ఒక్కోసారి కండరాలు క్షీణించే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. ముఖ్యంగా వ్యాయామానికి తగ్గట్లుగా ప్రొటీన్ తీసుకోకపోతే ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. క్యాలరీలను ఖర్చు చేయడంలో కండరాలు కీలకంగా వ్యవహరిస్తాయి. అలాగే కొన్ని వారాలకొకసారి వ్యాయామ తీవ్రతను కూడా మార్చుకోవాలని సూచిస్తున్నారు.

కఠినమైన ఆహార నియమాలు పాటించడం వల్ల తెలియకుండానే ఆహారంతో అనారోగ్యకరమైన బంధం ఏర్పడుతుందట. ఇందులో భాగంగా ఇష్టమైన ఆహారానికి దూరంగా ఉండడం.. సంప్రదాయ భోజనం చేయకపోవడం.. వంటివి చేస్తుంటారు. కొంతకాలం తర్వాత అపరాధ భావనకు లోనై.. తిరిగి సాధారణ డైట్‌కు మారుతుంటారని నిపుణులు చెబుతున్నారు. అలాగే బరువు తగ్గడానికి అనుసరించే ప్రతి డైట్ సత్ఫలితం ఇవ్వదని సూచిస్తున్నారు.

మరికొంతమందిలో సరైన డైట్ పాటించినా పీఎంఓఎస్, థైరాయిడ్, ఇన్సులిన్ నిరోధకత.. వంటి సమస్యలు బరువు తగ్గే అంశం పైన ప్రభావం చూపుతాయని చెబుతున్నారు. అందుకే బరువు తగ్గాలనుకునేవారు తాత్కాలిక డైట్ల మీద ఆధారపడకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందేలా జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు.

## తల్లి మానసిక ఆరోగ్యం... బిడ్డకూ మేలు!

కుంగుబాటు, తీవ్ర ఒత్తిడితో బాధపడే గర్భిణులకు కౌన్సెలింగ్ ఇస్తే వాళ్ల ఆరోగ్యం మెరుగవ్వడంతో పాటు బిడ్డకూ మేలని ఓ తాజా పరిశోధన చెబుతోంది. ప్రెగ్నెన్సీ సమయంలో సాధారణ తనిఖీకి వచ్చిన వాళ్లలో కుంగుబాటు సమస్యతో బాధపడుతున్న 234 మందిని ఎంపికచేసుకుని ఈ పరిశోధన చేశారు. వీళ్లంతా తొలి, ద్వితీయ



త్రైమాసికంలో ఉన్నవాళ్లు. వీళ్లకు కొద్దిరోజులపాటు సైకోథెరపీ(మాటలతో మనసును సానుకూలంగా మార్చడం) ఇచ్చారు. 'మామ్‌కేర్' పేరుతో చేపట్టిన ఈ కౌన్సెలింగ్‌ని వారాల వ్యవధిలో 50 నిమిషాలు చొప్పున ఎనిమిది సార్లు ఇచ్చారు. భావోద్వేగాల నియంత్రణ, వాగ్వాదాలకు దూరంగా సమస్యల్ని పరిష్కరించుకోవడం పైన దృష్టిపెట్టారు. పరిశోధనలో భాగమైన వాళ్లని రెండు బృందాలుగా విభజించారు. ఒక బృందంలో ఉన్నవారికి 'మామ్‌కేర్' కౌన్సెలింగ్‌నీ, రెండో బృందంలో ఉన్నవారికి మానసిక ఆరోగ్యాన్ని రక్షించుకోవడంపైన సమాచారాన్నీ అందించారు. రెండు బృందాలకూ ప్రామాణిక థెరపీ, మందులూ అందాయి. మామ్‌కేర్‌లో భాగమైన తల్లులపైన కౌన్సెలింగ్ ప్రభావవంతంగా పనిచేసిందని తేల్చారు. అదే సమయంలో ఆ తల్లులకు పుట్టిన పిల్లలు తక్కువ రోజులే హాస్పిటల్‌లో ఉన్నారట. తర్వాత కాలంలో ఎదుగుదల ఎంతో ఆరోగ్యంగా ఉంటూ స్కూళ్లోనూ మెరుగ్గా రాణించారట.

## ఉంగరాల జుట్టు చిక్కుల్లేకుండా!

ఒత్తుగా, మెలికలు తిరిగిన ఉంగరాల జుట్టుని ఈతరం అమ్మాయిలు తెగ ఇష్టపడుతున్నారు. ప్రత్యేకంగా కర్లింగ్ కూడా చేయించుకుంటున్నారు. అయితే, ఈ తరహా శిరోజాలను సరిగా మెయింటెయిన్ చేయలేకపోతే... వెంట్రుకలు తెగిపోవడమే కాకుండా, పొడిగా మారి రాలిపోయే ప్రమాదమూ ఎక్కువే. అలాకాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలంటే...



కర్లీ హెయిర్ ఉన్నవాళ్లు పొడిగా ఉన్నప్పుడు తల దువ్వకూడదు. తలస్నానం చేసిన వెంటనే కండిషనర్ లేదా సీరమ్ రాశాకే చిక్కులు తీయాలి. లేదంటే జుట్టు ఒంపులు దెబ్బతినడమే కాదు... పీచులా మారుతుంది.

మొత్తం జుట్టును ఒకేసారి దువ్వడానికి ప్రయత్నించొద్దు. నాలుగైదు చిన్న చిన్న భాగాలుగా విభజించి, ఒక్కో భాగాన్ని నిదానంగా వేళ్లతోనో, వెడల్పాటి దువ్వెనతోనో దువ్వండి. దీనివల్ల వెంట్రుకలపై ఒత్తిడి పడదు. సన్నటి పళ్లు ఉండే సాధారణ దువ్వెనలు, బ్రష్‌లను ఉపయోగిస్తే జుట్టు తెగిపోతుంది. వెడల్పాటి పళ్లున్న చెక్క దువ్వెన, డిటాంగ్లింగ్ బ్రష్‌లను మాత్రమే ఎంచుకోవాలి. లేదంటే వేళ్లతో చిక్కులు తీసుకోగలిగినా మేలే.

చాలామంది చేసే పొరపాటు తల పైభాగం నుంచి కిందకు గట్టిగా దువ్వడం. దీనివల్ల చిక్కులన్నీ కిందకు చేరి, జుట్టు ఊడిపోతుంది. ముందుగా శిరోజాల చివర్లలో ఉన్న చిక్కులను మెల్లగా తొలగించాలి. ఆపై కొద్దికొద్దిగా పైకి వెళ్తూ కుదుళ్ల వరకు దువ్వుకోవాలి.

తడి జుట్టుకు కండిషనర్ రాసి, అరచేతులతో కింద నుంచి పైకి మెల్లగా నొక్కడం వల్ల జుట్టు ఒంపులు స్పష్టంగా, అందంగా కనిపిస్తాయి. దీన్నే స్క్రంచింగ్ పద్ధతి అని పిలుస్తారు. గిరజాల జుట్టుకు తేమ చాలా అవసరం. వీలైనంత వరకు సల్ఫేట్‌రహిత షాంపూలు, కండిషనర్లను ఉపయోగిస్తే ఆరోగ్యంగా, అందంగా మెరుస్తూ ఉంటుంది.

## మాట్లాడుతూ... తింటున్నారా?



ఇంట్లో అందరూ కలిసి భోజనం చేసేటప్పుడు కబుర్లు చెప్పుకోవడం మనకు అలవాటే. ఒక్కోసారి ఫోన్లో కబుర్లు చెబుతూ తినేస్తుంటాం. ఇది సాధారణ విషయంలా అనిపిస్తోంది కదా. కానీ, ఇలా చేయడం ఆరోగ్యానికి మంచిది కాదంటున్నారు నిపుణులు. మన గొంతులో అన్నవాహిక, శ్వాసనాళం పక్కపక్కనే ఉంటాయి. ఆహారం మింగేటప్పుడు 'ఎపిగ్లోటిస్' అనే చిన్న కండరాల పొర శ్వాసనాళాన్ని మూసివేస్తుంది. దీనివల్ల ఆహారం జీర్ణాశయంలోకి వెళ్తుంది. కానీ, తింటూ మాట్లాడేటప్పుడు ఈ ఎపిగ్లోటిస్ తెరుచుకుంటుంది. దీనివల్ల ఆహార రేణువులు పొరపాటున శ్వాసనాళంలోకి వెళ్తాయి, దీనినే మనం 'పొలమారడం' అంటాం. మాట్లాడుతూ తింటున్నప్పుడు తీవ్రమైన దగ్గు, ఊపిరి ఆడకపోవడం జరుగుతుంది.

ఇది చిన్నపిల్లలు, వృద్ధుల్లో ప్రాణాపాయానికీ దారి తీయొచ్చు. దీంతో పాటు ఎక్కువ మొత్తంలో గాలి కూడా పొట్టలోకి వెళ్తుంది. ఇది గ్యాస్, ఎసిడిటీ, కడుపు ఉబ్బరంగా అనిపించడానికి కారణమవుతుంది. అందుకే తినేటప్పుడు మన దృష్టి ఆహారంపైనే ఉండాలి. మాట్లాడుతూ తినడంవల్ల దృష్టి ఇతర అంశాల మీదకి మళ్లుతుంది. దీనివల్ల నోట్లో లాలాజలం సరిగ్గా విడుదల కాక జీర్ణక్రియ మందగించి కడుపులో అసౌకర్యం కలుగుతుంది. అంతేకాదు ఆహారం బాగా నమలకుండా మింగేయడంతో అందులోని విటమిన్లు, ఖనిజాలను శరీరం పూర్తిగా గ్రహించలేదు. అందుకే తినేటప్పుడు కబుర్లలో పడిపోవద్దు. మీరు మాట్లాడకుండా తింటున్నారా మరి!

## ఒత్తిడి పెరిగితే... అందం తగ్గుతోంది!



ఆఫీసు, ఇంటి బాధ్యతల్ని సమన్వయం చేసుకునే క్రమంలో మహిళలు ఒత్తిడి బారిన పడుతున్నారు. ఈ ప్రభావం మనసు మీదే కాదు... చర్మ ఆరోగ్యంపైనా పడుతుందంటున్నారు నిపుణులు. ముఖ్యంగా మొటిమలు, చర్మం పొడిబారడం, ఎగ్జిమా వంటి సమస్యలు తలెత్తుతాయట. పరిష్కారం ఏంటంటే...

ఒత్తిడి వల్ల హార్మోన్లలో సమతుల్యత లోపిస్తుంది. ఇది చర్మంలో నూనె ఉత్పత్తిని పెంచుతుంది. దాంతో చర్మ రంధ్రాలు మూసుకుపోయి ముఖంపై ఉన్నట్టుండి మొటిమలు వస్తాయి. చర్మం పొడిబారుతుంది. ఒకవేళ ఎగ్జిమా ఉంటే ఎర్రటి మచ్చలు, దురద, మంట పెరుగుతాయి. వీటికితోడు శరీరంలో నీటి శాతం తగ్గితే చర్మం మరింత నిర్జీవంగా మారుతుంది. నిద్రలోనే మన శరీరం కొత్త ఉత్సాహాన్ని నింపుకొంటుంది. కాబట్టి రోజుకి కనీసం ఆరేడు గంటలు నిద్రపోవాలి. రోజుకో అరగంట యోగ, మెడిటేషన్ చేయాలి. వీటితోపాటు ముఖాన్ని మైల్డ్ ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసి, మాయిశ్చరైజర్, సన్‌స్క్రీన్ రాస్తుండాలి. ఒకవేళ ఫేస్ మీద మొటిమలు ఉంటే గిల్లడం, గిచ్చడం వంటివి చేయకూడదు. దానివల్ల మచ్చలు, వాపు పెరిగే అవకాశం ఎక్కువ. అంతేకాదు, జీవనశైలిలో మార్పులు చేసుకుంటూ... పోషకాహారం తీసుకోవడం, తగినన్ని నీళ్లు తాగడంపైనా దృష్టి పెట్టాలి. అంతేకాదు, సంగీతం వినడం, స్నేహితులతో మాట కలపడం, ఇష్టమైన ప్రదేశాల్ని చుట్టి రావడం వల్ల ఒత్తిడి నుంచి బయటపడొచ్చు అంటున్నారు.

## పసుపుతో... మెరుపు!

మన అమ్మమ్మలు, నానమ్మల కాలంలో ఫేస్ ప్యాక్ అంటే పసుపుతోనే. ఫేస్ క్రీమ్‌లు లేని ఆ రోజుల్లో వాళ్ల ముఖాల్లోని మెరుపు వెనకున్న కారణం ఇదే. కానీ, ఇప్పుడు పసుపు రాయాలంటే ఏ రకమైన మిశ్రమాన్ని వాడాలి? దేనితో రాసుకోవాలి? ఎలా రాసుకోవాలి? ఇలా ఎన్నో ప్రశ్నలు. అందుకే...

బయట పసుపు దొరుకుతున్నప్పటికీ కొన్నింటిలో రసాయనాలు కలిసే అవకాశం ఉంటుంది. అందుకే మార్కెట్‌లో లభించే పసుపు కంటే ఇంట్లో తయారు చేసుకున్నదే మేలు. పసుపు ఒక్కటే ముఖానికి రాయకూడదు. ఇతర పదార్థాలు కలిపి ఆ మిశ్రమాన్ని రాయాలి. ఎందుకంటే దీనిలోని 'కర్క్యుమిన్' అనే పదార్థం వల్ల సున్నితమైన చర్మానికి అలర్జీలు రావచ్చు. అందరి చర్మతత్వం ఒకేలా ఉండదు. కొందరిది పొడిచర్మం అయితే, మరికొందరిది జిడ్డుగా ఉంటుంది. అందుకే చర్మతత్వాన్ని బట్టి పసుపు మిశ్రమాన్ని ఎంపిక చేసుకోవాలి. మీది పొడి చర్మం అయితే పాలు, తేనె కలిపిన మిశ్రమాన్ని రాసుకోవాలి. ఇది చర్మానికి మంచి తేమని అందిస్తుంది. మీ చర్మం జిడ్డుగా ఉంటే శనగపిండి, నిమ్మరసం లేదా పెరుగుతో కలిపి ప్యాక్‌లా వేసుకోవాలి. ఇది ముఖంపై ఉండే అదనపు జిడ్డునూ, మొటిమలను తగ్గిస్తుంది. ఒకవేళ సాధారణ చర్మం అయితే రోజ్ వాటర్ లేదా అలోవెరా జెల్‌తో కలిపి రాసుకోవచ్చు. ఇది చర్మాన్ని ప్రకాశవంతంగా, తాజాగా ఉంచుతుంది. దీనికోసం ముందుగా ముఖాన్ని నీటితో శుభ్రంగా కడుక్కోవాలి. తర్వాత పసుపు మిశ్రమాన్ని నేరుగా ముఖానికి రాయకుండా చేతిపై లేదా చెవి వెనక భాగంలో కొద్దిగా రాసి 15 నిమిషాలు ఉంచండి. దురద లేదా ఎర్రగా అవ్వకపోతేనే ముఖానికి, మెడకు సమానంగా రాసుకోవచ్చు. చేతులతో కాకుండా బ్రష్‌తోగానీ, కాటన్‌తోగానీ సున్నితంగా ముఖానికి అద్దండి. పసుపు మరకలు దుస్తులపై పడితే వదలడం కష్టం. కాబట్టి, పాతవి వేసుకుని ప్యాక్ రాసుకోండి.



పసుపు ప్యాక్‌ను ముఖంపై 10–15 నిమిషాల కంటే ఎక్కువ సమయం ఉంచకండి. ఎందుకంటే ప్యాక్ పూర్తిగా ఎండిపోయేలా ఉంచితే చర్మం పొడిబారిపోతుంది. ప్యాక్ వేసుకున్న వెంటనే ఎండలోకి వెళ్లకూడదు. దీనివల్ల చర్మం త్వరగా నల్లబడే అవకాశం ఉంది. కాబట్టి రాత్రి పడుకునే ముందు రాసుకోవడం ఉత్తమం. పసుపు గుణాలు పనిచేయడానికి సమయం పడుతుంది. అందువల్ల కడిగిన తర్వాత కనీసం 24గంటలు వరకూ ముఖానికి ఎలాంటి సబ్బులు, ఫేస్ వాష్‌లు ఉపయోగించొద్దు. చల్లని లేదా గోరువెచ్చని నీళ్లతో ముఖాన్ని శుభ్రంగా కడగాలి. తర్వాత ముఖాన్ని గట్టిగా రుద్దకుండా.. మెత్తని టవల్‌తో అద్దుకోవాలి. పసుపు రాసుకోవడం వల్ల రక్తప్రసరణ మెరుగవుతుంది, చర్మం లోపలి నుంచి శుభ్రపడి ప్రకాశవంతమైన ఛాయను ఇస్తుంది.

దీనిలోని యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాను నశింపజేస్తాయి. ఇది చర్మంలోని 'టైరోసినేస్' అనే ఎంజైమ్‌ను అదుపు చేసి నల్లటి మచ్చలను, పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మకణాలను దెబ్బతినకుండా కాపాడి, చర్మంపై ముడతలు రాకుండా చేస్తాయి.

## మానసిక ప్రశాంతతకు... అష్టాంగ ఆసనం

సూర్య నమస్కారాల్లో ఒకటైన అష్టాంగ ఆసనం... శారీరక దృఢత్వానికీ, మానసిక ప్రశాంతతకూ సాయపడుతుంది. దీన్ని చేసేటప్పుడు రెండు పాదాలు, మోకాళ్లు, అరచేతులు, ఛాతీ, గడ్డం నేలను తాకుతాయి. అందుకే దీన్ని ఎనిమిది అంగాల భంగిమ అని కూడా అంటారు.

చేసేవిధానం: మ్యాట్‌పై వజ్రాసనం లేదా సుఖాసనంలో కూర్చొని, దీర్ఘ శ్వాస తీసుకోవాలి. తర్వాత బోర్లా పడుకోవాలి. ఇప్పుడు నెమ్మదిగా రెండు చేతుల్ని భుజాల కిందకు ఫొటోలో చూపించిన విధంగా తీసుకురావాలి. ఈ స్థితిలో శరీరం మొత్తం సరళరేఖలో ఉండేలా చూసుకోవాలి. ఇప్పుడు రెండు మోకాళ్లూ నేలకు ఆన్చి ఉంచి, నడుము, తుంటి భాగాల్ని సాధ్యమైనంత వరకు పైకి ఎత్తాలి. ఛాతీ, గడ్డాన్నీ మెల్లగా రెండు చేతుల మధ్య నేలకు తాకించాలి. ఈ భంగిమలో పొట్ట భాగం నేలకు తగలకుండా, మోచేతులు బయటికి రాకుండా పక్కటెముకలకు దగ్గరగా ఉండేలా చూసుకోవాలి. ఇప్పుడు సాధారణ శ్వాస తీసుకుంటూ... వదులుతూ.. 10–15 సెకన్లు ఈ భంగిమలో ఉండాలి. తర్వాత కాళ్లను వెనక్కి చాచి మకరాసనంలోకి వచ్చి విశ్రాంతి తీసుకోవాలి. జాగ్రత్త: మోకాళ్లు, తుంటి సర్జరీలు అయినవాళ్లు, గర్భిణులు ఈ ఆసనం వేయకూడదు. ఉపయోగాలు: శరీరానికి ఆక్సిజన్ సరఫరా జరిగి, రక్తప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుంది. భుజాలు, ఛాతీ, నడుము కండరాలకు బలం చేకూరుతుంది. అలాగే బీట్‌రూట్, క్యారెట్ వంటి కాయగూరలు, దానిమ్మ, బొప్పాయి, ద్రాక్ష లాంటి పండ్లను ఆహారంలో భాగం చేసుకోవాలి.



## స్ట్రెచ్‌మార్క్స్.. తగ్గాలంటే!

ప్రసవానంతరం చాలామంది మహిళల్ని ఇబ్బంది పెట్టే సమస్య స్ట్రెచ్‌మార్క్స్. ఒక్కోసారి వీటి వల్ల నచ్చిన దుస్తులు ధరించలేం.. అసౌకర్యంగానూ అనిపిస్తుంటుంది. అయితే ఈ సమస్యకు పరిష్కారంగా వైద్యులు సూచించిన మందులు, క్రీమ్‌లతో పాటు చిన్న చిన్న చిట్కాలు పాటించడం వల్ల కూడా ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. రోజూ మాయిశ్చరైజర్ రాసుకోవడం వల్ల చర్మం సాగే గుణాన్ని కోల్పోకుండా ఉంటుంది. ఇలా చేయడం వల్ల బరువు పెరిగినా లేదా తగ్గినా చారలు ఏర్పడకుండా జాగ్రత్తపడచ్చు. ఒకవేళ స్ట్రెచ్‌మార్క్స్ ఏర్పడ్డా.. ఆ ప్రదేశంలో క్రమం తప్పకుండా మాయిశ్చరైజర్ రాసుకోవడం వల్ల చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.



కలబందలో ఉండే ఔషధ గుణాలు కొన్ని రకాల చర్మ సంబంధిత సమస్యలకూ చక్కటి పరిష్కారం చూపుతాయి. కలబంద గుజ్జుని స్ట్రెచ్‌మార్క్స్ ఉన్న చోట రాసి మర్దన చేసుకోవాలి. తర్వాత నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందట.

ఇంట్లో మనకు అందుబాటులో ఉండే ఆముదం, కొబ్బరి నూనె, ఆలివ్ ఆయిల్.. వీటిలో ఏదో ఒకటి ఎంచుకొని రోజూ పది నిమిషాల పాటు స్ట్రెచ్‌మార్క్స్ ఉన్న చోట మర్దన చేసుకోవాలి. దీనివల్ల కూడా మంచి ఫలితం ఉంటుందని చెబుతున్నారు నిపుణులు.

## 4 ఖండాల్లో గనుల సమీకరణకు ఎన్ఎండీసీ యత్నం

దక్షిణ అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, ఆసియా ఖండాల్లోని పలు ప్రాంతాల్లో కీలక ఖనిజాలతో సహా వివిధ గనుల ఆస్తులను సమీకరించేందుకు ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఎండీసీ ప్రయత్నిస్తోంది. ఇందువల్ల వాహన, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రానిక్స్, ఉక్కు, అంతరిక్షం, రక్షణ, రైల్వేలు, మెట్రో రైలు వ్యవస్థల వంటి కీలక పరిశ్రమలకు అవసరమైన ముడి పదార్థాలను అందించొచ్చని సంస్థ భావిస్తోంది. ప్రస్తుతం మన దేశ ఇనుప ఖనిజ డిమాండ్‌లో దాదాపు నాలుగో వంతు అవసరాలను ఎన్ఎండీసీనే తీరుస్తోంది. భవిష్యత్తు ఆదాయంలో కనీసం 20 శాతాన్ని ఇతర ఖనిజాల విక్రయాల ద్వారా సంపాదించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.




## 4 రోజుల నష్టాలకు బ్రేక్.. లాభాల్లో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఓ వైపు అంతర్జాతీయంగా చమురు ధరలు గరిష్ఠ స్థాయుల వద్ద కొనసాగుతున్నప్పటికీ.. ఫార్మా, హెల్త్‌కేర్, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. దీంతో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 72,990.04 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,123.83) నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటి తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ.. చివరికి 482.92 పాయింట్ల లాభంతో 73,606.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 153.20 పాయింట్ల లాభంతో 22,753.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.19గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా, ట్రెంట్, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ సుజుకీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 115 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4018 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## నగదు చలామణిలో వృద్ధి అయిదేళ్ల గరిష్ఠానికి



దేశీయంగా ఈనెల 15వ తేదీ నాటికి చలామణిలో ఉన్న నగదు విలువ రూ.43.46 లక్షల కోట్లకు చేరిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. గతేడాది ఇదే సమయం కంటే ఇది 13.5% ఎక్కువని, ఈ వృద్ధి అయిదేళ్ల గరిష్ఠమని వెల్లడించింది. రిజర్వ్ మనీ కూడా 10.3% వృద్ధితో రూ.53.24 లక్షల కోట్లకు చేరుకుంది. సెప్టెంబరు 30తో ముగిసిన పక్షంలో కూడా చలామణిలో ఉన్న నగదు వృద్ధి 13.3 శాతంగా నమోదైంది.

**ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్ల వల్లేనా?**

రూపాయి పతనాన్ని ఆపే లక్ష్యంతో జూన్ 8న ప్రవేశపెట్టిన ఫారిన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ (బ్యాంక్)/ఎఫ్‌సీఎన్ఆర్(బీ) డిపాజిట్ పథకమూ చలామణిలో ఉన్న కరెన్సీ వృద్ధికి ప్రధాన కారణాల్లో ఒకటిగా భావిస్తున్నారు. ఈ పథకం కింద ఆగస్టు 31 వరకు బ్యాంకులు 133 బిలియన్ డాలర్లు సమీకరించాయి. 2025-26లో బహిరంగ మార్కెట్ కార్యకలాపాల ద్వారా రూ.8.8 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను ఆర్‌బీఐ కొనుగోలు చేసి, వ్యవస్థలో ద్రవ్య లభ్యత పెంచింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ స్వాప్ సదుపాయాల ద్వారా ద్రవ్య లభ్యత పెంచింది. ప్రస్తుతం అదనపు ద్రవ్య లభ్యతను ఉపసంహరించుకోవడాన్ని ఆర్‌బీఐ ప్రారంభించింది. విదేశీ మారకపు ద్రవ్య మార్కెట్లో ఆర్‌బీఐ జోక్యం కొనసాగడం, పండగల సమయంలో ప్రజలు అధికంగా నగదు వినియోగించడం వల్ల.. బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత మరింత తగ్గొచ్చు. దీనివల్ల రిజర్వ్ మనీ వృద్ధి మందగించే అవకాశం ఉంది.

**ఒడుదొడుకులు తట్టుకుంటున్నాం**

మన దేశం ఇంధనాన్ని అధికంగా దిగుమతి చేసుకుంటున్నా.. దేశీయ వినియోగం/సేవల రంగం బలంగా ఉండటం వల్ల ప్రపంచ ఆర్థిక పరిణామాల ప్రభావాన్ని తట్టుకోగలుగుతున్నట్లు ఆర్‌బీఐ వివరించింది. రిటెయిల్ ద్రవ్యోల్బణం పెరుగుతూ, వివిధ వస్తువుల ధరలు అధికమవుతున్నందున.. నియంత్రణకు తగిన ద్రవ్య విధాన చర్యలు అవసరమని ఆర్థిక వేత్తలు భావిస్తున్నారు.

## తక్కువ ధర వల్లే బియ్యం ఎగుమతులు పుంజుకుంటాయ్

అంతర్జాతీయంగా బియ్యానికి గిరాకీ పెరుగుతుండగా, పోటీ దేశాల కంటే మనదగ్గర ధర తక్కువగా ఉండటంతో.. ఇక్కడి నుంచి బియ్యం ఎగుమతులు మరింత పుంజుకుంటాయని ఇండియన్ రైస్ ఎక్స్‌పోర్టర్స్ ఫెడరేషన్ (ఐఆర్ఈఎఫ్) తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో మన



దేశం నుంచి రూ.54,937.71 కోట్ల విలువైన బియ్యం ఎగుమతి అయ్యాయి. ఏడాది క్రితం ఇదే సమయం కంటే ఈ విలువ 13% ఎక్కువ. థాయిలాండ్, మయన్మార్ వంటి దేశాలతో పోలిస్తే మన బియ్యం ధర కనీసం 10% చౌక. ఎల్‌నినో ముప్పు కారణంగా, ప్రపంచ వ్యాప్తంగా వరి దిగుబడి తగ్గే అవకాశం ఉండటంతో, మన బియ్యానికి అంతర్జాతీయంగా గిరాకీ పెరుగుతోంది. 2025-26 పంట కాలంలో మనదేశం 154 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ బియ్యాన్ని ఉత్పత్తి చేసింది. గత ఏడాది 22 మి.టన్నులుగా ఉన్న బియ్యం ఎగుమతులు, ఈఏడాది 24మి.టన్నులకు మించొచ్చని ఐఆర్ఈఎఫ్ వైస్ ప్రెసిడెంట్ దేవ్ గార్గ్ ధీమా వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.1,12,000 కోట్ల విలువైన బాస్మతి, బాస్మతీయేతర బియ్యం ఎగుమతి అయ్యాయి. మన దేశం మొత్తం బాస్మతి బియ్యం ఎగుమతుల్లో 74 శాతానికి పైగా పశ్చిమాసియా దేశాలకే చేరుతున్నాయి. ప్రస్తుత యుద్ధ వాతావరణం వల్ల బియ్యానికి గిరాకీ పెరిగింది. యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే, కొనుగోలుదార్లు మరీ ఎక్కువ ధరలు చెల్లించలేకపోవచ్చు.

## 5 ఐపీఓలు.. రూ.2,600 కోట్ల సమీకరణ




ఈపీఏ ఇండియా ఆల్టర్నేటివ్స్, ఎస్ఎఫ్‌సీ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్, ఎంకే సన్స్ ఫైన్ జువెల్స్, బీఎల్ఎస్ పాలిమర్స్, బాంబే కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్స్ కంపెనీలు ఈ వారం ఐపీఓకు రాబోతున్నాయి. ఇవన్నీ కలిపి ప్రాథమిక మార్కెట్ నుంచి రూ.2,600 కోట్లు సమీకరించనున్నాయి.

గుజరాత్ విక్టరీ ఫోర్జింగ్, మైల్‌స్టోన్ గేర్స్, అవాడా ఎలక్ట్రో, స్వరా బేబీ ప్రోడక్ట్స్, ఇంటిగ్రిస్ మెడ్‌టెక్, ఏజీఎస్ హెల్త్ తదితర కంపెనీలు కూడా త్వరలో ఐపీఓలకు రాబోతున్నాయి. వీటి ధరల శ్రేణి నవంబరు 5 లోపు ప్రకటించే అవకాశం ఉంది.

నవంబరు 6 నుంచి 15 వరకు గుజరాత్‌లో 'లాభ్ పంచమ్' సెలవుల కారణంగా, కంపెనీలు ముందుగా ఐపీఓ ప్రణాళికలను ప్రకటిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ సంస్థలైన ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ కంపెనీ (ఐఐఎఫ్‌సీఎల్), మహానది కోల్‌ఫీల్డ్స్, సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ (ఎస్ఈసీఎల్) లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

## హ్యుందాయ్ నుంచి మిడ్‌సైజ్ ఎస్‌యూవీ..

హ్యుందాయ్ మోటార్ ఇండియా మిడ్‌సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో బేయాన్‌ను లాంచ్ చేసింది. దీని ధరను రూ.9.99 లక్షలుగా (ఎక్స్ షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. హ్యుందాయ్ వెబ్‌సైట్ లేదా ఆథరైజ్డ్ డీలర్‌షిప్స్ వద్ద రూ.11 వేలు చెల్లించి దీనిని బుక్ చేసుకోవచ్చు. మిడ్‌సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో మారుతీ సుజుకీ విక్టోరిస్‌తో ఇది పోటీ పడనుంది.

హ్యుందాయ్ బేయాన్ 4,245 ఎంఎం పొడవు, 1810 ఎంఎం వెడల్పు, 2600 ఎంఎం వీల్‌బేస్‌తో వస్తోంది. 205 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్ ఇచ్చారు. స్ప్లిట్ హెడ్‌ల్యాంప్, స్లిమ్ ఎల్ఈడీ డీఆర్ఎల్స్ ఉన్నాయి. పెటల్ స్టైల్ అల్లాయ్ వీల్స్ ఇచ్చారు. 505 లీటర్ల బూట్ స్పేస్ కల్పించారు.

ఇంటీరియర్ విషయానికొస్తే.. 12.3 అంగుళాలు కలిగిన రెండు డ్యాష్‌బోర్డులు ఇచ్చారు. ఒకటి ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, మరొకటి ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ కోసం కేటాయించారు. దేశంలోనే తొలిసారి జనరేటివ్ ఏఐ వాయిస్ అసిస్టెంట్ సదుపాయాన్ని ఇందులో అందిస్తున్నారు. 70 రకాల కనెక్టెడ్ ఫీచర్లు కలిగిన హ్యుందాయ్ బ్లూలింక్ సదుపాయం ఉంది. ఇందులో 1.5 లీటర్ ఫోర్ సిలిండర్ నేచురల్ యాస్పిరేటెడ్ ఎంపీఐ




పెట్రోల్ ఇంజిన్ ఇచ్చారు. ఇది 115 బీహెచ్‌పీ పవర్‌ను, 144 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సిక్స్ స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్, హ్యుందాయ్ ఇంటిలిజెంట్ వేరియబుల్ ట్రాన్స్‌మిషన్ (iVT), CVT ఆప్షన్లతో లభిస్తుంది. సీవీటీ వేరియంట్ లీటర్‌కు 18.6 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని తెలిపింది.

ఇందులో ఎకో, నార్మల్, స్పోర్ట్ డ్రైవ్ మోడ్స్ ఉన్నాయి. ఆరు ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హ్యుందాయ్ స్మార్ట్‌సెన్స్ లెవల్ 2 ప్రో ADAS ఫీచర్లు ఉన్నాయి. ఫార్వర్డ్ కొలిజన్ వార్నింగ్, బ్లైండ్ స్పాట్ కొలిజన్ వార్నింగ్, లేన్ కీపింగ్ అసిస్ట్, లేన్ డిపాచుర్ వార్నింగ్, డ్రైవింగ్ అటెన్షన్ వార్నింగ్ వంటి సదుపాయాలు ఉన్నాయి.




## సింధు మళ్లీ..



ఆన్ సి యాంగ్.. ఈ కొరియా అమ్మాయితో ఆడిన గత పది మ్యాచ్‌ల్లో భారత బ్యాడ్మింటన్ స్టార్ పి.వి.సింధు గెలవలేదు. అదే ఫలితం పునరావృతమైంది. మరోసారి ఆన్ సి యాంగ్ చేతిలో సింధు ఓడిపోయింది. ఈసారి ఆమె తలొంచింది ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో! ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ తుది పోరులో సింధు 21-16, 11-21, 12-21తో ఒలింపిక్ ఛాంపియన్ ఆన్ సె యాంగ్ చేతిలో ఓడింది. తొలి గేమ్ గెలిచి జోరు మీద కనిపించిన సింధు.. అక్కడ నుంచి తడబడింది. తప్పిదాలు చేసి ప్రత్యర్థికి అవకాశం ఇచ్చింది. దీంతో రెండో గేమ్‌లో యాంగ్ 3-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. సింధు కాస్త పుంజుకున్నా.. కొరియా అమ్మాయి మాత్రం పట్టువదల్లేదు. బలమైన క్రాస్‌కోర్టు షాట్లు, మెరుపు స్మాష్‌లతో పాయింట్లు రాబట్టిన ఆమె, 13-7తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరుతో గేమ్‌గెలుచుకుని మ్యాచ్‌లోనిలిచింది. నిర్ణయాత్మక మూడో గేమ్ ఆరంభంలో సింధు-యాంగ్ నువ్వానేనా అన్నట్లు ఆడారు.

## ఇక మాకు చావోరేవో..

## భారత్ మమ్మల్ని ఒత్తిడికి గురి చేసింది: బ్రాస్‌వెల్

సొంత గడ్డపై వరుసగా రెండు టీ20ల్లో న్యూజిలాండ్ ఓడిపోయింది. భారత్‌తో ఐదు టీ20ల సిరీస్ రేసులో నిలవాలంటే మంగళవారం జరగబోయే మూడో మ్యాచ్‌లో కివీస్ కచ్చితంగా నెగ్గాలి. మూడో టీ20కి వెల్లింగ్టన్ వేదిక కానుంది. ఇప్పటికే స్టార్ పేసర్లు మాట్ హెన్రీ, ఫెర్గూసన్ గాయం కారణంగా కీలక సమయంలో దూరం కావడం ఆ జట్టుకు పెద్ద దెబ్బే. ఈ క్రమంలో కివీస్ స్పిన్ ఆల్‌రౌండర్



మైకెల్ బ్రాస్‌వెల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. గత మ్యాచుల్లో టీమ్‌ఇండియా తమను ఒత్తిడిలోకి నెట్టిందని అంగీకరించాడు. అయితే, ఆ ఓటముల్లోనూ సానుకూల అంశాలను నేర్చుకున్నట్లు వెల్లడించాడు. 'ఈ సిరీస్ చాలా ఉత్సాహంగా సాగుతోంది. గత రెండు మ్యాచుల్లో పొరపాట్లు చేశాం. ఇప్పటి వరకు జరిగిన టీ20ల్లోనూ చివరి వరకూ పోరాడాం. ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుని బరిలోకి దిగుతాం. వెల్లింగ్టన్‌లో విజయం సాధించి మళ్లీ సిరీస్ రేసులోకి వస్తాం. అంతర్జాతీయ క్రికెట్‌లో టీమ్‌ఇండియా టాప్. ఇలాంటి జట్టును ఓడించాలంటే అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించాలి. గత కొన్నేళ్లుగా మేం ఇలానే ఆడుతున్నాం. కానీ, ఈ రెండు మ్యాచుల్లో పూర్తి స్థాయిలో ప్రదర్శన చేయలేకపోయాం. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఇంకాస్త మెరుగ్గా రాణించాలి. ఈ సిరీస్‌లో మమ్మల్ని టీమ్‌ఇండియా ఒత్తిడికి గురిచేసిందనేది అంగీకరించాలి. డెత్ ఓవర్లలో మా బ్యాటింగ్ లైనప్‌ను వారి బౌలర్లు బాగా అడ్డుకొన్నారు. అదే సమయంలో ఆ జట్టు బ్యాటర్లు బాగా ఆడారు. నా స్పెల్ చివరి బంతిని ఓసారి గమనిస్తే.. భారీ సిక్స్‌ను భారత బ్యాటర్ కొట్టాడు. ఒకవేళ అతడి మిస్‌టైమ్ అయితే నాకు వికెట్ లభించేది. కానీ, అలా జరగలేదు. టీ20 క్రికెట్‌లో ఇలాంటి చిన్నవే పెద్ద ప్రభావం చూపిస్తాయి. ఇక రాబోయే చావోరేవో మ్యాచుల్లో సత్తా చాటుతాం'' అని బ్రాస్‌వెల్ అన్నాడు.

## కివీస్ Aతో మ్యాచ్.. వివాదాస్పదమైన ఔట్.. పడిక్కల్ ద్విశతకం మిస్!



ఇది కదా అసలైన పోరాటం.. ఇన్నింగ్స్ తేడాతో ఓటమి తప్పదేమో అన్న పరిస్థితి నుంచి ప్రత్యర్థికి మంచి లక్ష్యం నిర్దేశించే స్థాయికి భారత్ A జట్టు చేరుకుంది. ప్రధాన బ్యాటర్లు విఫలమైనా సరే.. మేమున్నామంటూ ముందుకొచ్చారు యువ ఆటగాళ్లు. మరీ ముఖ్యంగా దేవదత్ పడిక్కల్ అద్భుతమైన ఆటతో అబ్బురపరిచాడు. అయితే, 199 పరుగుల వద్ద ఉన్నప్పుడు అంపైర్ వివాదాస్పదమైన నిర్ణయంతో పడిక్కల్ పెవిలియన్‌కు చేరి డబుల్ సెంచరీని మిస్ చేసుకున్నాడు. న్యూజిలాండ్ ఏ జట్టుతో జరుగుతోన్న అనధికారిక తొలి టెస్టు మ్యాచ్‌లో భారత్ పటిష్ఠ స్థితిలో నిలిచింది. మూడో రోజు ఆట ముగిసేసమయానికి టీమ్‌ఇండియా 8 వికెట్ల నష్టానికి 488 పరుగులు చేసింది. క్రీజ్‌లో వాషింగ్టన్ సుందర్ (51★)తోపాటు ఆకాశ్ దీప్ ఉన్నాడు. ప్రస్తుతం 284 పరుగుల ఆధిక్యంలో భారత్ ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 317 పరుగులకు ఆలౌట్ కాగా.. టీమ్‌ఇండియా 113 పరుగులకే కుప్పకూలింది. కేవలం పది పరుగులకే ఓపెనర్లను కోల్పోయిన జట్టును దేవదత్ పడిక్కల్ (199: 248 బంతుల్లో 24 ఫోర్లు, 3 సిక్స్‌లు), సాయి సుదర్శన్ (91: 184 బంతుల్లో 12 ఫోర్లు) ఆదుకున్నారు. ఓవర్‌నైట్ 106/2 స్కోరుతో మూడో రోజు ఆట ప్రారంభించిన భారత్‌కు గొప్ప పునాది వేశారు. మూడో వికెట్‌కు ఏకంగా 215 పరుగులను జోడించారు. అయితే, కాస్తలో సెంచరీని చేజార్చుకున్న సాయి సుదర్శన్‌తోపాటు కెప్టెన్ ధ్రువ్ జురెల్ (1) పెవిలియన్‌కు చేరడంతో మళ్లీ కష్టాల్లోకి వెళ్లింది జట్టు. కానీ, యశ్ రాథోడ్ (66)తో కలిసి దేవదత్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. వీరిద్దరూ 142 పరుగులు జోడించారు. అయితే, కేవలం ఒక్క పరుగు తేడాతో పడిక్కల్ డబుల్ సెంచరీని మిస్ చేసుకున్నాడు. లెగ్‌సైడ్ పడిన బంతిని ఆడేందుకు పడిక్కల్ ప్రయత్నించాడు. కానీ, అది మిస్ అయింది. అంపైర్ మాత్రం ఎడ్జ్ తీసుకుందని భావించి ఔట్ ఇచ్చేశాడు. దీంతో పడిక్కల్ తీవ్ర అసహనంతో మైదానం వీడాడు. ఇప్పుడీ వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. కనీసం సరైన నిర్ణయం కూడా తీసుకోలేరా? అని విమర్శలు వస్తున్నాయి. దేవదత్ పడిక్కల్‌తోపాటు యశ్ కూడా వెంటనే ఔటయ్యాడు. కానీ, అన్షుల్ కాంబోజ్ (23), అకిబ్ నబీ (38)తో కలిసి వాషింగ్టన్ సుందర్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. దీంతో టీమ్‌ఇండియా 500 పరుగులకు చేరువగా వచ్చింది. ఈ క్రమంలో సుందర్ తన హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు.

## మరో మ్యాచ్‌కూ ఇషాన్ దూరం..



భారత ఆటగాడు ఇషాన్ కిషన్ గాయం నుంచి కోలుకున్నా.. మ్యాచ్ ఆడేంత ఫిట్‌నెస్ సాధించలేదు. దీంతో న్యూజిలాండ్‌తో మూడో టీ20లోనూ అతడు ఆడటం లేదని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ వెల్లడించాడు. ఇదే విషయాన్ని బీసీసీఐ కూడా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేసింది. దీంతో వైభవ్ సూర్యవంశీకి మరో అవకాశం వచ్చినట్లైంది. ఇప్పటికే ఐదు టీ20ల (IND vs NZ) సిరీస్‌లో టీమ్‌ఇండియా 2-0 ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే. వెల్లింగ్టన్ వేదికగా మంగళవారం జరిగే మూడో మ్యాచ్‌లోనూ గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని టీమ్‌ఇండియా భావిస్తోంది. ఈ క్రమంలో మోర్నీ మోర్కెల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. ''ఇషాన్ కిషన్ ఇంకా పూర్తిస్థాయిలో మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించలేదు. మూడో టీ20 కోసం బరిలోకి దిగడం లేదు. బీసీసీఐ వైద్య బృందం నిరంతరం అతడి పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. భువనేశ్వర్ కుమార్ పునరాగమనం తర్వాత ప్రదర్శనపై బయట చర్చ జరుగుతోంది. అతడిపై భారీగా అంచనాలు ఉంటాయి. అతడి రీ ఎంట్రీ దాదాపు నాలుగేళ్ల తర్వాత జరిగింది. గత రెండు ఐపీఎల్ సీజన్లలో అద్భుతమైన ఆటతీరు ప్రదర్శించాడు. కానీ, అంతర్జాతీయంగా పరిస్థితులు కాస్త భిన్నం. కచ్చితంగా అతడి నైపుణ్యం, అనుభవం జట్టుకు ఉపయోగపడుతుంది. కుదురుకోవడానికి కాస్త సమయం ఇవ్వాలి. రెండో టీ20లో మయాంక్ బదులు ప్రిన్స్‌ను తీసుకోవడం వెనుక వ్యూహం ఉంది. డెత్ ఓవర్లలో ప్రిన్స్ మెరుగ్గా బౌలింగ్ చేస్తాడు. ఎక్కువగా యార్కర్లను సంధిస్తాడు.

## రోహిత్ శర్మ వర్కౌట్లు చేయడన్నది కేవలం భ్రమే: సోహమ్ దేశాయ్

టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 39 ఏళ్ల వయసులోనూ మైదానంలో చురుగ్గా ఉంటున్నాడు. గతంతో పోలిస్తే స్లిమ్‌గానూ మారాడు. అంతకుముందు పెద్దగా వర్కౌట్లు చేసేవాడు కాదని.. ఇప్పుడే వాటిపై దృష్టిపెట్టినట్లు కొందరు వ్యాఖ్యలు చేశారు. కానీ, అదంతా అవాస్తవమని భారత మాజీ కండీషనింగ్ అండ్ స్ట్రెంగ్త్ కోచ్ సోహమ్ దేశాయ్ స్పష్టం చేశారు. 2017లో తుంటి గాయంతో బాధపడిన రోహిత్.. అప్పట్నుంచి వారానికి రెండుసార్లైనా స్ట్రెంగ్త్ ట్రైనింగ్‌లు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్న రోహిత్.. వచ్చే ఏడాది 50 ఓవర్ల క్రికెట్ వరల్డ్ కప్‌లో ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.



''చాలా మంది రోహిత్‌ను .. లావుగా ఉంటాడు.. ఫిట్‌నెస్ కోసం ఏమీ చేయడని అంటుంటారు. కానీ, వారు అర్థం చేసుకోవాల్సిన విషయం ఒకటుంది. కెరీర్‌నే ప్రమాదంలోకి నెట్టేలా 2017లో రోహిత్ గాయపడ్డాడు.

# ఎన్టీఆర్ 'డ్రాగన్' పై లేటెస్ట్ అప్ డేట్



**వుదయం సినిమా:** యాక్షన్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ – ఎన్టీఆర్ కలయికలో రాబోతున్న సినిమా డ్రాగన్. ఈ భారీ పాన్ ఇండియా చిత్రం షూటింగ్ మళ్లీ ఊపందుకుంది. ప్రస్తుతం హైదరాబాద్ రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతుంది. లాస్ట్ షెడ్యూల్ లో అనిల్ కపూర్‌తో పాటు ఇతర నటీనటులపై కొన్ని ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరించారు. ప్రస్తుతం ఎన్టీఆర్‌పై మరికొన్ని కీలకమైన సన్నివేశాలు, భారీ యాక్షన్ ఎపిసోడ్స్ ను చిత్రీకరిస్తున్నారు. మిగిలిన షూటింగ్ పార్ట్ మొత్తం డిసెంబర్ సెకండ్ వీక్ లోపు ఫినిష్ చేయాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.అన్నట్టు భారీ స్థాయిలో వీఎఫ్ఎక్స్, సౌండ్ డిజైన్, ఇతర పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఆల్ రెడీ మొదలు అయ్యాయట. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి ఈ సినిమాని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. మొత్తానికి ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. అన్నట్టు ప్రశాంత్ నీల్ సినిమా అనగానే ఫుల్ బ్లాక్ అండ్ గ్రే షేడ్ ఫ్రేమ్ మాత్రమే ఎక్కువ కనిపిస్తోంది. కానీ, ఎన్టీఆర్ తో తీస్తున్న ఈ సినిమా ఫ్లాష్ బ్యాక్ మొత్తం ఫుల్ కలర్ ఫుల్ గా ఉంటుందట.

వుదయం సినిమా MOVIE TIME!

# బాలయ్య'కి జోడీగా మళ్లీ ఆ హీరోయినే?



**వుదయం సినిమా:** కొరటాల శివ దర్శకత్వంలో బాలయ్య బాబు హీరోగా ఓ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఇక ఈ సినిమాలో నటించే హీరోయిన్ గురించి ఇప్పటికే చాలా రూమర్స్ వచ్చాయి. ఐతే, తాజాగా వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం.. సంయుక్త మీనన్ ను హీరోయిన్ గా ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. ఆమె గతంలో 'అఖండ 2'లో కూడా బాలయ్యతో కలిసి నటించిన సంగతి తెలిసిందే. అన్నట్టు ఈ ప్రాజెక్టుకు సంబంధించి బాలయ్య సరికొత్త మేకోవర్‌లో కనిపించబోతున్నాడు.ఇక ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ వచ్చే నెల మొదటి వారం నుంచి స్టార్ట్ చేయనున్నారు. ముందుగా తీయనున్న యాక్షన్ సీన్స్ కోసం ఓ భారీ సెట్ వేస్తున్నారట. కాగా ఈ సినిమా మొదటి షెడ్యూల్ లో బాలయ్య లేని సన్నివేశాలను తీయబోతున్నారని తెలుస్తోంది. అన్నట్టు ఈ సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా ఉంటాయని తెలుస్తోంది. స్టోరీ కూడా ప్రత్యేకంగా ఉంటుందట. దేవర తర్వాత కొరటాల శివ చేస్తున్న సినిమా కావడంతో.. కథ పై కొరటాల బాగా కసరత్తులు చేశారట. కాగా సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# 'ధర్మన్'లో లేడీ సూపర్‌స్టార్ నయనతార



**వుదయం సినిమా:** సూపర్‌స్టార్ రజనీకాంత్ 'ధర్మన్' సినిమా నుంచి మేకర్స్ మరో ఆసక్తికరమైన అప్‌డేట్ ఇచ్చారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లో లేడీ సూపర్‌స్టార్ నయనతార చేరినట్లు ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. రజనీకాంత్, నయనతార మరోసారి జతకట్టడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సమర్పణలో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్‌ను కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తుండగా, అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్‌తో సినిమా అంద రి దృష్టిని ఆకర్షించింది. ఇందులో రజనీకాంత్ ఓ మిస్టీరియస్ డాక్టర్‌గా, చేతిలో రక్తపు మరకలున్న స్కాల్ పెల్‌తో 'ది డెడ్లీ డాక్టర్' అనే విభిన్నమైన అవతార్‌లో కనిపించారు. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో రజనీకాంత్, నయనతార భారీ కిటికీ ముందు ఎదురెదురుగా నిలబడి కనిపించారు. కిటికీ నుంచి ప్రసరి స్తున్న బంగారు కాంతి మధ్యలో వారి సిల్హౌట్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ పోస్టర్‌లోని విజువల్స్‌తో పాటు, సినిమాలో వారి పాత్రలు ఎలా ఉండబోతున్నాయనే ఆసక్తి కూడా పెరిగింది. రజనీకాంత్, నయనతార కలిసి నటించడం ఇది ఐదోసారి. గతంలో వీరిద్దరూ 'చంద్రముఖి', 'కథానాయకుడు', 'దర్బార్', 'పెద్దన్న' సినిమా ల్లో కలిసి నటించారు. ఇప్పుడు 'ధర్మన్'తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుండటంతో ఈ క్రేజీ పెయిర్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమా టోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రదీప్ ఈ. రాఘవ్ ఎడిటింగ్. ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్లు అన్బరివ్ ఈ సినిమా యాక్షన్ సీక్వెన్స్‌లను రూపొందిస్తున్నారు.రజనీకాంత్‌ను మిస్టీరియస్ డాక్టర్‌గా పరిచయం చేసిన ఫస్ట్ లుక్, ఇప్పుడు నయనతార ఎంట్రీతో 'ధర్మన్'పై ఆసక్తి మరింత పెరిగింది. విభిన్నమైన కథాంశం, టాప్ స్టార్స్, సాంకేతిక నిపుణుల కలయికతో ఈ సినిమా ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది.

# 'ఆదర్శ కుటుంబం – హౌస్ నెం. 47' త్రివిక్రమ్ సినిమాలకు భిన్నంగా ఉంటుంది..

**వుదయం సినిమా:** 20 ఏళ్ల తర్వాత వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో 'ఆదర్శ కుటుంబం' పై భారీ అంచనాలు ఉన్నాయి. ఇటీవల విడుదలైన ట్రైలర్ ఆ అంచనాలను రెట్టింపు చేసింది. విడుదల తేదీ దగ్గర పడటంతో ప్రచార కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా మీడియాతో ముచ్చటించిన కథానాయిక శ్రీనిధి శెట్టి, సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

**ఈ సినిమాకు ఓకే చెప్పడానికి మిమ్మల్ని ఎక్సైట్ చేసిన అంశం ఏమిటి?**

త్రివిక్రమ్ గారి దర్శకత్వంలో సినిమా చేయాలనే కోరిక నాకు ముందు నుంచి ఉంది. అలాంటిది ఆయన నుంచి పిలుపు రావడం సంతోషంగా అనిపించింది. పైగా ఇది త్రివిక్రమ్ గారికి, వెంకటేష్ గారికి కూడా కొత్త జానర్.

**మీ పాత్ర ఎలా ఉంటుంది? కామెడీ చేయడం ఎలా అనిపించింది?**

త్రివిక్రమ్ గారు చెప్పినట్లు ఇది క్రైమ్ కామెడీ మూవీ. డార్క్ కామెడీ ఉంటుంది. నేను మొదటిసారి కామెడీ పాత్ర చేశాను. నేను చిట్ ఫండ్ లో డబ్బులు పోగొడతాను. మొత్తం అప్పులు చేసేస్తాను. ఇప్పటిదాకా ఈ తరహా పాత్రలు చేయకపోవడంతో ఎలా చేస్తాననే సందేహం మొదట కాస్త కలిగినా.. అవుట్ పుట్ చూసుకున్న తర్వాత ఎంతో సంతృప్తి కలిగింది.

**త్రివిక్రమ్ డైలాగులు అద్భుతంగా ఉంటాయి. ఆయన డైలాగులు మీరు చెప్పడం ఎలా అనిపించింది?**

– త్రివిక్రమ్ గారి డైలాగుల్లో ఎంతో భావం ఉంటుంది. అందుకే ప్రతి డైలాగ్ నేను చెప్పేముందు దాని అర్థం తెలుసుకునే ప్రయత్నం చేశాను. సినిమాలో ఎన్నో అద్భుతమైన డైలాగులు ఉన్నాయి. రైటింగ్ లో ఆయన మ్యాజిక్ కనిపిస్తుంది. ట్రైలర్ లోని "చచ్చే సైన్యం లేకుండా గెలిచే యుద్ధం ఏది సార్?" అనే డైలాగ్ అయితే నాకు మాత్రమే కాదు, అందరికీ ఎంతగానో నచ్చింది.

**సినిమా విడుదల ఆలస్యం కావడంపై ఏమైనా నిరాశ చెందారా?**

ఒక సినిమాపై ఏడాదిన్నర కష్టపడి, అవుట్ పుట్ ను ఇంకా మెరుగుపరిచే అవకాశం ఉన్నప్పుడు, కంగారుపడి విడుదల చేసే కంటే కాస్త ఆలస్యంగా రావడంలో తప్పులేదు. ఇదే విషయాన్ని నిర్మాత నాగవంశీ గారు కూడా చెప్పారు.

**మీరు తక్కువ సినిమాలు చేయడానికి కారణం.?**

కంటెంట్ పరంగా నాకు నచ్చిన సినిమాలు చేసుకుంటూ వస్తున్నాను. 'ఆదర్శ కుటుంబం' కూడా నా మనసుకి నచ్చి ఎంపిక చేసుకున్న సినిమానే. అయితే నేను చేస్తున్న పెద్ద సినిమాలు ఏడాది రెండేళ్లు సమయం తీసుకుంటున్నాయి. అందుకే తక్కువ సినిమాలు చేస్తున్నాను అనిపిస్తుంది. 'ఆదర్శ కుటుంబం' కూడా 2025 జూలైలో జాయిన్ అయ్యాను. సంవత్సరం దాటి పోయింది.



కథానాయిక శ్రీనిధి శెట్టి

# 'డార్క్ చాక్లెట్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్



**వుదయం సినిమా:** రానా దగ్గుబాటి, స్పిరిట్ మీడియా, వాల్టెయిర్ ప్రొడక్షన్స్‌తో కలిసి 'డార్క్ చాక్లెట్' చిత్రాన్ని ను సగర్వంగా అందిస్తున్నారు. విశ్వదేవ్ రాచకొండ, బిందు మాధవి లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. శశాంక్ శ్రీవాస్తవయ దర్శకత్వం వహించిన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కు ఇప్పటికే మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా నవంబర్ 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు.హీరో విశ్వదేవ్ రాచకొండ మాట్లాడుతూ..“అందరికీ నమస్కారం. ప్రతి మనిషిలో ఒక డ్యూయాలిటీ ఉంటుంది. అది ఈ సినిమా చూసినప్పుడు మిర్రర్ రిఫ్లెక్షన్స్‌లా మీకు కనిపిస్తుంది. ఇది నెవర్ బిఫోర్, ఎవర్ ఆఫ్టర్‌లాంటి సినిమా. ఇలాంటి సినిమా ఇంతకుముందు ఎప్పుడూ రాలేదు. ఏ భాషలో వచ్చిన సినిమాతోనూ దీనిని కంపేర్ చేయలేరు. ఇది ఒక తెలుగు సినిమా అని గర్వంగా చెప్తున్నాను. డైరెక్టర్ శశాంక్ ఈ సినిమాను చాలా విభిన్నంగా తీశాడు. ఇందులో చాలా లేయర్స్ ఉంటాయి. వండర్‌ఫుల్ ఎక్స్‌పీరియెన్స్, ఎక్స్‌పెరిమెంట్ ఉంది. మేము ఈ సినిమా స్క్రిప్ట్‌ను అప్‌లోడ్ చేసినా, మీరు స్క్రిప్ట్ చదువుకుని థియేటర్‌కు వచ్చినా ఎలాంటి మార్పు ఉండదు. కచ్చితంగా ఒక కొత్త, డిఫరెంట్ ఎక్స్‌పీరియెన్స్ ఇస్తుంది. ఈ సినిమా చూసిన తర్వాత తప్పకుండా దాని గురించి మాట్లాడుకునేలా ఉంటుంది. '35', 'పరేషాన్', 'డబుల్ ఇంజన్' సినిమాలన్నీ నిజాయితీగా చేసినవే. డార్క్ చాక్లెట్ సినిమా చాలా ఎంగేజింగ్‌గా ఉంటుంది. ఇప్పటికే కొన్ని స్క్రీనింగ్స్ వేశాం. ఐదుసార్లు చూసిన వాళ్లు కూడా ఉన్నారు. వాళ్లు ఎందుకు ఇన్నిసార్లు చూస్తున్నారు అనేది మీకు సినిమా చూసిన తర్వాత అర్థమవుతుంది. ఈ సినిమా మ్యూజిక్ కూడా చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా తరతరాల పాటు గుర్తుండిపోయి, ఒక బెంచ్‌మార్క్‌లా నిలబడిపోతుందనే నమ్మకం ఉంది.

# 'రోమియో జూలియట్' సాంగ్ లాంచ్

**వుదయం సినిమా:** హర్షిత్, విశాఖ ధిమాన్ జంటగా నటిస్తున్న 'రోమియో జూలియట్' సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. భార్గవ్ మాచర్ల రచన, దర్శ కత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ సమర్పిస్తుండగా, నవరస ఎంటర్‌టైన్ మెంట్స్ బ్యానర్‌పై సుందీప్ ఎన్, వెంకటేశ్వరరావు చల్లగుళ్ల నిర్మిస్తున్నారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ మంచి అంచనాలు క్రియేట్ చేసింది. 'రోమియో జూలియట్' నవంబర్ 13న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ సారీ బేబీ సాంగ్ లాంచ్ చేశారు.సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరో హర్షిత్ మాట్లాడుతూ.. “దివాన సినిమాకి అందరూ సపోర్ట్ చేశారు. 'రోమియో జూలియట్'కు మీ సపోర్ట్ కావాలని కోరుతున్నాను. మా సినిమా గ్లింప్స్ మంచి రెస్పాన్స్ వచ్చింది.



# 418' కు ఎక్స్‌ట్రార్డినరీ రెస్పాన్స్ వస్తోంది..

**వుదయం సినిమా:** పాన్ ఇండియా ప్రొడక్షన్ హౌస్ మైత్రీ మూవీ మేకర్స్ లేటెస్ట్ సూపర్ హిట్ '418'. దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పణలో ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్ రూపొందిన ఈ సినిమాతో కీర్తన్ నాదగౌడ దర్శకుడిగా పరిచయం అయ్యారు. నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. చైత్ర ఆచార్, సూర్య రాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల, శశాంక్ పాటిల్ కీలక



పాత్రల్లో నటించారు అక్టోబర్ 23న విడుదలైన ఈ సినిమా అద్భుతమైన రెస్పాన్స్ తో సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో మైత్రీ నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ..“అందరికీ నమస్కారం. '418' సినిమాకు చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. నిన్నటి కంటే ఈరోజు చాలా బాగుంది. మేము చేసిన ఫస్ట్ హారర్ సినిమా ఇది. మా బ్యానర్‌కు ఇంత మంచి సినిమా చేసి పెట్టిన డైరెక్టర్ కీర్తన్‌కు థాంక్స్. చాలా యంగ్ టీమ్‌తో చేసిన సినిమా ఇది. ఒక యంగ్ టీమ్‌తో పనిచేసి హిట్ వస్తే ఆ ఆనందం వేరుగా ఉంటుంది. కొత్త ప్రతిభను ప్రోత్సహించడానికి ఈ సినిమా మాకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చింది. అందరూ ఈ సినిమాను థియేటర్స్ లో చూడాలని కోరుకుంటున్నాను.”నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ..“కీర్తన్ ఎక్స్‌ట్రార్డినరీ స్టోరీ రాసి, సినిమాను అద్భుతంగా చేశాడు. సౌండ్ డిజైన్, మ్యూజిక్ కూడా చాలా అద్భుతంగా ఉన్నాయి. ఈ సినిమా బాగుందని అందరూ అంటున్నారు. అదే సమయంలో సౌండ్ డిజైన్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. టెక్నికల్‌గా సినిమా అద్భుతం. ప్రకీర్తన్ యంగ్ టీమ్‌ను సెలెక్ట్ చేసుకుని సినిమాను చాలా పెద్ద సక్సెస్ చేశాడు. ప్రీమియర్స్ అన్నీ ఫాస్ట్‌గా ఫుల్ అయ్యాయి.

Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 4-1-47, Kothur Janda, Hanmakonda, Warangal Urban - 506001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. TELTEL/2015/65064, E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.